

ర్యాలీ ఉంది..
విద్యార్థులను తీసుకురండి!

- ఒక్కొక్కరికి రూ.500, బైక్‌కు పెట్రోలు
- లెక్చరర్ల వాట్సప్ గ్రూపులో మెసేజీలు
- విజయసాయి స్వాగత ర్యాలీ కోసం ఓ ప్రైవేటు విద్యా సంస్థ కుస్తీ



లెక్చరర్ల వాట్సప్ గ్రూపులో మెసేజీలు

ఈ ఫొటో చూశారా!? వాట్సప్ గ్రూప్‌లో ఒక ప్రైవేట్ కళాశాల లెక్చరర్ల మధ్య జరిగిన సంభాషణలివి. కేసీడీసీ అనే పొట్టి అక్షరాలు జిల్లాలోని ఏ కాలేజీకి సరిపోలుతాయో అందరికీ తెలుసు. సదరు విద్యా సంస్థ యాజమాన్యం పేరు పెద్దల సభ వరకు వెళ్లింది. ఇక మెసేజ్‌ల సారాంశంలోకి వద్దాం. జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ మెసేజ్‌లు ఈ నెల 5వ తేదీ సాయంత్రం 7 గంటల ప్రాంతంలో సర్క్యులేట్ అయ్యాయి. రేపు (బుధవారం) వైసీపీ ర్యాలీకి ప్రతి లెక్చరర్ 25 మంది కాలేజీ విద్యార్థులను లేదా తెలిసినవారిని తీసుకొని రావాలన్నది దాని సారాంశం. అలా వచ్చిన ప్రతి ఒక్కరికి రూ.500 ప్లస్ మోటారు సైకిల్‌కు పెట్రోలు చార్జీలు చెల్లిస్తారని కూడా సదరు మెసేజ్‌లో ఉంది. బుధవారం ఉదయం మన ఎమ్మెల్సీ డబ్బులు ఇస్తారని కూడా ఆ మెసేజ్‌లో పేర్కొన్నారు. వాళ్ల మన ఎమ్మెల్సీ అన్నారంటే ఆ ఎమ్మెల్సీ ఎవరై ఉంటారబ్బా!? ఇది కూడా కాస్తో కూస్తో లోకజ్ఞానం ఉన్నవారందరికీ అర్థమైపోతుంది.

ఇంతకూ ఎవరి కోసం ర్యాలీ అనుకుంటున్నారా!? అక్కడకే వద్దాం. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్న రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి బుధవారం ఉదయం నెల్లూరులో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు హంగామా చేయడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఒక ప్రైవేటు విద్యాసంస్థ లెక్చరర్లు ఈ ర్యాలీని విజయవంతం చేసే బాధ్యతను తీసుకుని వాట్సాప్ గ్రూప్‌లో సమాచారం పంచుకున్నారు. అనుకున్నట్లుగానే భారీ సంఖ్యలో విద్యార్థులను ర్యాలీకి తీసుకెళ్లారు. ఇక్కడ బాధకరం ఏమంటే.. విద్యార్థులను కూలి జనంగా భావించారు. విద్యా ప్రమాణాలను, ఉపాధ్యాయులు, అధ్యాపకుల గౌరవాన్ని కాపాడాల్సిన వ్యక్తి, కాపాడుతానని ప్రమాణం చేసిన వ్యక్తి పేరు మీదే ఈ గ్రూప్ మెసేజ్‌లు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేయడం ఆ వృత్తిలోని చాలా మందిని కలచివేసింది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

విజయసాయి కార్యక్రమానికి కందుకూరు ఎమ్మెల్యే దూరం

కందుకూరు : నెల్లూరులో విజయసాయిరెడ్డి కార్యక్రమానికి ఆ పార్టీకి చెందిన కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి దూరంగా ఉన్నారు. ఇటీవల విజయసాయిరెడ్డి జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నేతలతో కలిసి మహీధరరెడ్డి నివాసానికి వచ్చి మద్దతు కోరిన విషయం తెలిసిందే. అయితే అనూహ్యంగా బుధవారం జరిగిన కార్యక్రమానికి విజయసాయిరెడ్డి స్వయంగా ఆహ్వానించినా మహీధరరెడ్డి హాజరుకాకపోవటం చర్చనీయాంశమైంది. కాగా, మహీధరరెడ్డి మంగళవారం సీఎంఓకు వెళ్లి కీలక నేతలతో చర్చలు జరిపి వచ్చినట్లు సమాచారం.

● మాగుంట కుమారుడితో భేటీ

కాగా బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే మహీధరరెడ్డితో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు రాఘవరెడ్డి భేటీ అయ్యారు. తెలుగుదేశం పార్టీలో చేరేందుకు మాగుంట కుటుంబం సిద్ధమైందని వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో ఆయన మహీధరరెడ్డితో భేటీ కావడం చర్చనీయాంశమైంది. ఒంగోలు పార్లమెంటుతో కందుకూరు నియోజకవర్గానికి సంబంధం లేనప్పటికీ ఆయన మహీధరరెడ్డితో ప్రత్యేకంగా భేటీకావటం వెనుక రాజకీయ ప్రాధాన్యత ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

నవ్విపోదురుగాక మాకేటి..!

- ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో వైసీపీ సభ



సభలో బుర్రా మధుసూదన్ మాట్లాడుతుండగానే వెళ్లిపోతున్న జనం

ఉలవపాడు : మండల కేంద్రమైన ఉలవపాడులో బుధవారం జరిగిన కందుకూరు వైసీపీ సమన్వయకర్త, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పరిచయ బహిరంగ సభ విమర్శలకు తావిచ్చింది. ప్రభుత్వ కార్యాలయాలైన సచివాలయం-3, రైతు భరోసా కేంద్రాల ప్రాంగణంలో సభకు అధికారులు అనుమతులు అనుమతి ఇవ్వడంపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. గత ఏడాది కరేడు పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాల ముందున్న సిమెంట్ రోడ్డుపై టీడీపీ కార్యక్రమం నిర్వహించింది. పైగా ఆ రోజు సెలవు అయినా విద్యాశాఖ ఉన్నతాధికారులచేత పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసులు జారీచేసి ఇబ్బందులకు గురిచేశారు. అలాంటిది ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో రాజకీయ సభను నిర్వహించడంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు పట్టుపడుతున్నాయి.

● మహీధర్‌రెడ్డి వర్గం దూరం

బుర్రా మధుసూదన్ పరిచయ సభకు కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి వర్గీయులు గైర్హాజరయ్యారు. కరేడు పంచాయతీని శాసించే రెడ్డి సామాజికవర్గం నాయకులు సభకు హాజరు కాలేదు. అదేవిధంగా భీమవరం, బద్ధిపూడి, చాకిచర్ల, ఆత్మకూరు గ్రామాలకు చెందిన నాయకులు కూడా పాల్గొనలేదు. మరోవైపు సభలో మధుసూదన్ మాట్లాడుతుండగానే జనం లేచి వెళ్లిపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. జనసమీకరణలో వలంటీర్లు, వెలుగు వీవోఏలు చెమటోడ్చారు.



వరికుంటపాడు : పెద్దిరెడ్డిపల్లి వద్ద నిలిచిన రిజర్వాయర్ పనులు

మా సంగతేంటి జగనన్నా!



ప్రకాశం జిల్లాలో పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న జగన్ సర్కారు జిల్లాలోని మెట్టప్రాంత వాసుల చిరకాల వాంఛ అయిన వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మాణాన్ని గాలికి వదిలేసింది. ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలకు వరప్రసాదినిగా చెప్పుకొనే ఈ ప్రాజెక్టు ఈ ప్రాంత రైతులు, ప్రజలకు అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. మొన్నటివరకు నత్తనడకన సాగిన ఆ రిజర్వాయర్ పనులు ప్రస్తుతం నిలిచిపోవడంతో ఇక పనులు సాగడం కలేనా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

- 'వెలుగొండ' అంతర్భాగాన్ని మరచిపోయారా!.

- రూ.97.39 కోట్లతో పెద్దిరెడ్డిపల్లి వద్ద రిజర్వాయర్
- 2007లో పనులకు శంకుస్థాపన
- దశలవారీగా పెరిగిన గడువు తేదీ
- పైసా విదల్చని వైసీపీ ప్రభుత్వం
- రెండేళ్ల క్రితమే పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- ఆందోళనలో మెట్టప్రాంతవాసులు

వరికుంటపాడు, మార్చి 6 : తీవ్ర దుర్భిక్షంలో కొట్టుమిట్టాడుతున్న నెల్లూరు, ప్రకాశం, వైఎస్‌ఆర్ కడప జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణానికి శిలాఫలకాన్ని 2004లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టుకు అంతర్భాగంగా 1,650 మీటర్ల పొడవు, 32 మీటర్ల ఎత్తుతో 2.501 టీఎంసీల సామర్థ్యంతో వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి పూనుకున్నారు. ప్రకాశం జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్టు పడమటి కాలువ ద్వారా ఈ ట్యాంకుకు నీటిని తరలించేలా రూపకల్పన చేశారు. రూ.97.39 కోట్లతో చేపట్టే ప్రాజెక్టుకు 2007లో అప్పటి ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు శంకుస్థాపన చేయగా, 2009లో పనులు ప్రారంభమయ్యాయి. ఇక్కడున్న నీటిని ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల పరిధిలోని 65 వేల ఎకరాలకు సాగునీరు, 1.5 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించనున్నారు. అందులో భాగంగా వరికుంటపాడు మండలంలో 13వేల ఎకరాలు, ఉదయగిరిలో 11వేలు, దుత్తలూరులో 20వేల ఎకరాలతోపాటు ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు మండలంలో 21వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించారు. తొలుత వేగంగా సాగిన పనులను చూసిన ఈ ప్రాంత రైతులు, ప్రజలు ఇక తమ కష్టాలు తీరినట్లేనని సంబరపడ్డారు. 2012 వరకు అదే జోరుగా సాగిన పనులు ఆపై క్రమేణా నిధులు లేకపోవడంతో 2016 వరకు నిలిచిపోయాయి. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా పనులు మాత్రం ఆశించిన రీతిలో ముందుకు సాగలేదు. పాలకుల నిర్లక్ష్యమో లేదా అధికారుల అలసత్వమో ఏమోగానీ అంతంతమాత్రంగా సాగిన పనుల్లోను అక్రమాలు చోటు చేసుకున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పటిదాకా రూ.44.9 కోట్ల పనులు జరిగాయి. ఈ క్రమంలో నిధులు సైతం సకాలంలో విడుదల కాకపోవడంతో ఆశించిన మేర పనులను పూర్తి చేయలేని దుస్థితిలో కాంట్రాక్టర్ తన యంత్రాలు, సామగ్రిని తీసుకొని అక్కడ నుంచి జారుకున్నాడు. పనులు నిలిపి వేసి సుమారు రెండేళ్లు కావస్తున్నా పట్టించుకొనే నాధులే కరువయ్యారు.



కంపచెట్లు మొలిచి పగుళ్లిస్తున్న కట్ట

● శిథిలమవుతున్న పనులు

ఇదంతా ఒక వంతైతే చేపట్టిన అరకొర పనులు సైతం నామరూపాలు లేకుండా పోతున్నాయి. ఏళ్ల తరబడి పనులు నిలిచి పోవడంతో పనులు చేపట్టిన ప్రాంతంలో కంపచెట్లు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తున్నాయి. వాటి ప్రభావంతో కట్ట సైతం నెర్రలు బారి రోజు రోజుకు గుంతమయంగా మారుతుంది. అలాగే రివిట్‌మెంట్ పనులు సైతం అసంపూర్తిగా నిలిచిపోవడంతో కింది భాగంలోని మట్టి కోతకు గురై ఛిద్రమవుతున్నాయి. దీంతో అటువైపు చూసిన ప్రతి ఒక్కరు రూ.కోట్లు వెచ్చించి చేపట్టిన పనుల లక్ష్యం నీరుగారి పోతోందంటూ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● ఎన్నటికి పూర్తయ్యేనో

2009లో ప్రారంభమైన ఆ ప్రాజెక్టు పనులను 2013 ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఆ సమయానికి ఆశించిన మేర పనులు సాగకపోవడంతో మరో రెండేళ్లపాటు గడువును పెంచారు. అయినా మందకొడిగా సాగుతున్న పనులతో ఫలితం లేకపోవడంతో వాయిదాల పర్వం సాగించిన ప్రభుత్వాలు వరుసగా రెండేళ్ల గడువును పెంచుతూ చివరికి 2022, సెప్టెంబరు నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఈ గడువూ ముగిసి ఒకటిన్నర ఏడాది కావస్తున్నా పనులు పూర్తి దశకు చేరుకోలేదు. ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయకపోగా, సమగ్ర పర్యవేక్షణ లేకపోవడంతో ఇలాంటి పరిస్థితి దాపురించిందని మెట్ట రైతన్న పెదవి విరుస్తున్నాడు. ఇలాంటి తరుణంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించడం విడ్డూరంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతర్భాగమైన ప్రాజెక్టులపై దృష్టి సారించడం మరిచిపోయారా అనే ప్రశ్నలు సైతం వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ప్రాజెక్టు పనులను పునఃప్రారంభించేలా చర్యలు చేపట్టాలని మెట్టవాసులు కోరుతున్నారు.



శేష వాహనంపై విహరిస్తున్న ఆది దంపతులు

శేషవాహనంపై పన్నగ భూషణుడు

నెల్లూరులో జరుగుతున్న శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మూలస్థానేశ్వరాలయంలో ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, చప్పర ఉత్సవం, భువనేశ్వరీ అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. రాత్రి శేషవాహన ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా విశేష పూలంగి సేవ, పూజలు జరిగాయి.

● వైభవంగా అంకురార్పణ

రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలోని సుందరేశ్వర స్వామికి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు వైభవంగా అంకురారోపణ జరిగింది. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ పూజలు జరిగాయి.



అమ్మవారికి పుష్పాభిషేకం చేస్తున్న అర్చకులు

యోహం పుష్పం వేదా..!

- రాజరాజేశ్వరికి వైభవంగా పుష్పయాగం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 6 : నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారికి బుధవారం సాయంత్రం పుష్పయాగం నయనానందకరంగా జరిగింది. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగి 49 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ వేడుక నిర్వహించారు. ఆలయమంతా చేసిన విశేష పుష్పాలంకారం, విద్యుద్దీపాలంకరణ భక్తులను ఆకట్టుకున్నాయి. ప్రధాన అర్చకుడు రఘురామ మూర్తి ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పుష్పయాగం సందర్భంగా విఘ్నేశ్వరపూజ, లలితా సహస్ర నామ పూజలు, షోడశోపచారాలు జరిగాయి. రాజరాజేశ్వరి సేవా సంస్థ వ్యవస్థాపకుడు, వైసీపీ నగర అధ్యక్షుడు నన్నపరెడ్డి పెంచలరెడ్డి కుటుంబం ఉభయకర్తలుగా వ్యవహరించింది. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ నాయకులు, సింహపురి డాల్ మిల్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, సహాయ కమిషనర్ జే వెంకట సుబ్బయ్య, అర్చక బృందం పర్యవేక్షించింది.



కలెక్టర్‌ను కలిసిన జేసీ సేతు మాధవన్

జాయింట్ కలెక్టర్‌గా సేతు మాధవన్


నెల్లూరు (హరనాథపురం) : నూతన జాయింట్ కలెక్టర్‌గా సేతు మాధవన్ బుధవారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన వారు. గతంలో ప్రకాశం జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా, మార్కాపురం సబ్ కలెక్టర్‌గా పని చేశారు. రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ శాఖలో సీఈఓగా పనిచేస్తూ బదిలీపై నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సేతు మాధవన్ మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ, భూసర్వే సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని చెప్పారు. కాగా, జిల్లా సర్వేశాఖ సహాయ సంచాలకులు హనుమాన్‌ప్రసాద్ జేసీకి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం జేసీ కలెక్టర్ హరినారాయణన్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.



నెరవేరిన కల : వైద్య డిగ్రీ పట్టా అందుకున్న కుమార్తెను చూసి మురిసిపోతున్న తల్లిదండ్రులు

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించండి!


- నవభారత్ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాలి
- అమ్మభాషకు ప్రాధాన్యం ఇవ్వాలి
- యువ డాక్టర్లకు పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య పిలుపు
- ఉత్సాహంగా ప్రభుత్వ వైద్య కళాశాల స్నాతకోత్సవం



నెల్లూరు (వైద్యం), మార్చి 6 : అరవై శాతం ప్రజలున్న గ్రామీణ ప్రాంతాలలో అనేక రకాల వ్యాధులు ప్రబలుతున్నాయని, అలాంటి చోట్ల వైద్య సేవలు అందించాలని పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు సూచించారు. బుధవారం నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాల స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. 2018 బ్యాచ్‌కు చెందిన 148 మంది యువ వైద్యులకు వైద్య డిగ్రీపట్టాలు అందించారు. అంతకుముందు యువ వైద్యులచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడారు. నవభారత నిర్మాణానికి వైద్యులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఆత్మనిర్భర్ భారత్ స్వావలంభన కోసం కృషి చేయాలని తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రులు ఎక్కువగా ఉన్నాయని, కొన్నింటిలో రోగులు వెళితే రకరాల పరీక్షల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని అలాంటి వాటికి పాల్పడవద్దని హితవు పలికారు. యువతలో 45 శాతం మంది మానసిక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. అలాంటి వారు అధ్యాత్మిక, వ్యాయామం వైపు దృష్టి పెడితే కొంతవరకు ఉపశమనం పొందవచ్చని పేర్కొన్నారు. వారానికి ఒక రోజు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వైద్యసేవలు అందించాలని కోరారు. గతంలో దొడ్ల సుబ్బారెడ్డి ఆసుపత్రిగా ఉన్న పెద్దాసుపత్రికి ఎంతో పేరు ఉందని తన కుమార్తె కూడా ఈ ఆసుపత్రిలోనే జన్మించిందని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం వైద్య కళాశాలకు అనుబంధంగా రూపాంతరం చెందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల అభివృద్ధికి ఎంతోమంది పూర్వ విద్యార్థులు సహకరిస్తున్నారని అదేవిధంగా ఇక్కడ కూడా సహకరించాలన్నారు. అమ్మభాషా తెలుగుకు ప్రాధాన్యత ఇచ్చి రోగులతో మాట్లాడాలని సూచించారు. జీజీహెచ్ సూపరింటెండెంటెంట్ డాక్టర్ సిద్దా నాయక్ మాట్లాడుతూ 750 పడకలతో ఉన్న ఆసుపత్రికి సూపర్‌స్పెషాలిటీ వైద్య చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆర్డీవో మలోల మాట్లాడుతూ వైద్యో నారాయణో హరి అన్న సూక్తిని ఆదర్శంగా తీసుకుని యువ వైద్యులు మెలగాలని కోరారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ స్నాతకోత్సవంలో వైద్యులు మస్తాన్‌బాషా, నరేంద్ర పాల్గొన్నారు.

● అట్టహాసంగా..

ప్రభుత్వ వైద్య కళాశాల 5వ స్నాతకోత్సవం బుధవారం సాయంత్రం అట్టహాసంగా జరిగింది. 2018 బ్యాచ్‌కు చెందిన మెడికోలకు డిగ్రీ పట్టాల పంపిణీ జరగడంతో తల్లిదండ్రులు తరలివచ్చారు. పట్టాలు అందుకున్న పిల్లలను ఆప్యాయంగా హత్తుకుని తమ ఆనందాన్ని తెలియచేశారు. కేరళకు చెందిన వాయిద్య బృందం ఈ స్నాతకోత్సవంలో ప్రత్యేకతను చాటుకుంది. అలాగే అడుగడున విద్యుత్ దీపాలను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చి దిద్దారు. మెడికోలు ఉత్సాహంగా పాల్గొని తమ అధ్యాపకుల ప్రసంగాలకు కేరింతలు కొట్టారు.



ప్రతిజ్ఞ చేస్తున్న యువ వైద్యులు



కందుకూరు-1లో పొగాకు వేలం ప్రారంభిస్తున్న అధికారులు, రైతు ప్రతినిధులు

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

- కలిగిరి, కందుకూరు, మర్రిపాడు కేంద్రాలలో వేలం
- తొలిరోజున కిలో పొగాకు రూ.230



కలిగిరిలో ప్రారంభమైన పొగాకు కొనుగోళ్లు

కలిగిరి/కందుకూరు/మర్రిపాడు : 2023-24 సీజన్ పొగాకు కొనుగోళ్లు బుధవారం ప్రారంభమయ్యాయి. కలిగిరి కేంద్రంలో పూజల అనంతరం దుత్తలూరు క్లస్టరు పరిధిలోని రైతులు 18 పొగాకు బేళ్లను తీసుకొచ్చారు. 11 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని పొగాకును కొనుగోలు చేశారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.231, కనిష్ఠ ధర రూ.230 పలికింది. కాగా, రీజనల్ మార్కెట్ ట్రేడ్‌వింగ్ రీజనల్ మేనేజర్ హెచ్‌కే గోపాల్, వేలం నిర్వహణా ధికారి మహేష్ కుమార్ రైతుల సమక్షంలో పొగాకు కొనుగోలు కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. కంపెనీ ప్రతినిధులుగా రైతుకు పూర్తిస్థాయి మద్దతుధర అందించాలని సూచించారు.

● డీసీపల్లిలో...

మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు బోర్డులో బుధవారం వేలం ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజు రైతులు తెచ్చిన 18 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా, కిలో పొగాకు రూ.230లతో కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహనాధికారి జి.రాజశేఖర్ తెలిపారు.

● కందుకూరులో రెండు చోట్ల..

కందుకూరులోని రెండు పొగాకు వేలం కేంద్రాలలో బుధవారం వేలం ప్రక్రియ ప్రారంభమైంది. పొగాకు బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతు ప్రతినిధులతో పూజలు చేయించి వేలం ను ప్రారంభించారు. తొలిరోజు 18 బేళ్ల చొప్పున వేలానికి తెప్పించగా అత్యధిక ధరగా కిలోకు రూ. 230 నిర్ణయించి కొనుగోళ్లు చేశారు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు మాట్లాడుతూ అత్యధిక ధరను రూ.250కి పెంచాలని సరాసరి ధర గిట్టుబాటయ్యేలా చర్యలు తీసుకోవాలని బోర్డు అధికారులకు విజ్ఞప్తి చేశారు. బోర్డు కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ రైతులు తమ బేళ్లను వేలానికి తెచ్చే ముందురోజు వేలం కేంద్రాలకు వచ్చి మార్కెట్‌ను పరిశీలించుకుని అందుకనుగుణంగా బేళ్లను సిద్ధం చేసుకుని తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణా ధికారులు రాజగోపాల్‌రెడ్డి, మీనా, రైతు ప్రతినిధులు మాదాల రమణయ్య, తాటికొండ రమణయ్య, శివారెడ్డి, వడ్లమూడి రామకృష్ణ పాల్గొన్నారు.



ఇళ్ల నుంచి తెచ్చుకున్న భోజనాన్ని తింటున్న విద్యార్థులు

మనమైతే ఈ అన్నం తినగలమా!?

వలేటివారిపాలెం మండలంలోని చుండి మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉంటోంది. సంగటిలా ఉంటున్న అన్నాన్ని తినలేక విద్యార్థులు పస్తులు ఉంటున్నారు. కొంతమంది ఆ అన్నాన్ని చెత్తకుప్పలో పడేస్తున్నారు. ఈ మోడల్‌స్కూల్లో 415 మంది విద్యార్థులు ఉండగా, 300 మంది వరకు మధ్యాహ్నం భోజనం తింటున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీవేంకటేశన్ చెబుతున్నారు. వడ్డించిన పులిహోర సంగటిలా ఉండటంతో విద్యార్థులు తినలేక ఇబ్బందిపడ్డారు. నీళ్ల సాంబారు తదితర కూరలు రుచిగా లేకపోవడంతో తినలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఇక్కడ అన్నం తినలేక కొంత మంది ఇళ్ల నుంచి క్యారియర్లు తెచ్చుకుంటున్నారు. నాసిరకం బియ్యం వల్ల అన్నం సంగటి అవుతోందని ప్రిన్సిపాల్ తెలిపారు. మరోవైపు రెండు నెలలుగా బిల్లులు కూడా ప్రభుత్వం మంజూరు చేయడం లేదని భోజన నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యతగల భోజనం వడ్డించాలని విద్యార్థులు కోరుతున్నారు.



ముద్దగా పులిహోర

- వలేటివారిపాళెం

నెల్లూరుకు విమానాశ్రయం తీసుకొస్తా

● రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి

వెంకటాచలం, మార్చి 6: రాబోయే ఎన్నికల్లో ఆదరిస్తే నెల్లూరుకు విమానాశ్రయం తీసుకొస్తానని నెల్లూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి అన్నారు. చెముడుగుంట సమీపంలో ఉన్న శ్రీడ్స్ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరుకు విమానాశ్రయంతోపాటు ఇన్నర్ ఔటర్ రింగ్ రోడ్డును తీసుకువస్తానన్నారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరు రూరల్‌లో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు మేయర్ స్రవంతి, ఎన్‌డీసీబీ బ్యాంకు మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు తదితరులున్నారు.

ప్రియుడిపై ప్రియురాలు హత్యాయత్నం

● పెట్రోల్ పోసి నిప్పంటించిన వైనం



చికిత్స పొందుతున్న మస్తాన్‌రెడ్డి

ఆత్మకూరు, మార్చి 6: వివాహేతర సంబంధం నేపథ్యంలో ప్రియుడిపై ప్రియురాలు హత్యాయత్నానికి పాల్పడిన సంఘ టన మండలంలోని అప్పారావుపాళెం గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు అప్పారావుపాళెంకు చెందిన ఓ మహిళకు వివాహమై భర్తకు దూరంగా ఉంది. ఈ క్రమంలో ఆమెకు అదే గ్రామానికి చెందిన మస్తాన్‌రెడ్డితో తొమ్మిదేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ క్రమంలో కొద్ది రోజులుగా ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. సదరు మహిళ తనతో గాక వేరొకరితో వివాహేతర సంబంధం ఉందని తలచిన మస్తాన్‌రెడ్డి తీవ్రంగా హెచ్చరించాడు. దీంతో ఆమె మస్తాన్‌రెడ్డిని అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. ఈనేపథ్యంలో మస్తాన్ రెడ్డి బేల్దారు పనిచేసుకునేందుకు కడపకు వెళ్లి శివరాత్రి పండుగకని అప్పారావుపాళెం వచ్చాడు. బుధవారం ఉదయం మహిళ ఇంటికి వెళ్లగా బాత్‌రూంలో వేడినీళ్లు పెట్టాను.. స్నానం చేయ మని చెప్పడంతో అతను బాత్‌రూమ్ కెళ్లి స్నానం చేస్తుండగా బయట గడియపెట్టి అతనిపై పెట్రోల్ పోసి నిప్పంటిం చింది. దీంతో అతను తలుపును గట్టిగా తన్ని మంటలతో కేకలేసుకుంటూ బయటకు పరిగెత్తాడు. ఈక్రమంలో మహిళ కుమార్తె గుమ్మం వద్ద ఉండడంతో ఆమెకు కూడా గాయాల య్యాయి. మస్తాన్‌రెడ్డికి తీవ్ర గాయాలు కాగా స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని పట్టణం లోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనలో గాయపడిన మహిళ కుమార్తె కూడా వైద్యశాలలో చికిత్స పొందుతోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీసీ జి వేణు తెలిపారు.

అనారోగ్యాన్ని తట్టుకోలేక ఆత్మహత్య

● జీజీహెచ్ రెండో అంతస్థు నుంచి దూకిన వృద్ధుడు ● చికిత్స పొందుతూ మృతి



ఘటన స్థలంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న పెంచలయ్య

నెల్లూరు(క్రైం), మార్చి 6: జీజీ హెచ్‌లో చికిత్స పొందుతూ ఆరోగ్యం కుదుట పడటం లేదని మనస్తాపానికి గురైన వృద్ధుడు ఆసుపత్రి రెండవ అంతస్థు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బుధ వారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు... ఆత్మకూరు ప్రాంతం కనుపూరుపల్లి గ్రామానికి చెందిన పెంచలయ్య(63)కు వివాహమై ఇద్దరు సంతానం. మద్యానికి బానిసైన పెంచలయ్య లివర్ సంబం ధిత వ్యాధులతో బాధపడుతు న్నాడు. ఇటీవల తీవ్రంగా కడుపునొప్పి రావడంతో ఆయనను కుటుంబసభ్యులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు గత నెల 28వ తేదీ నెల్లూరు జీజీహెచ్‌లో చేర్పించారు. అప్పటి నుంచి రెండవ అంతస్థులోని పురుషుల వార్డులో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు తోడుగా ఉన్న కుమారుడు రవీంద్ర ఈ నెల 4వ తేదీన డబ్బు కోసం స్వగ్రామానికి వెళ్లాడు. దీంతో పెంచలయ్య ఒక్కడే వైద్యశాలలో ఉండేవాడు. ఆ రోజు రాత్రి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో వైద్య సిబ్బంది ఇంజెక్షన్ చేసి సెలైన్ పెట్టారు. 5వ తేదీ తెల్లవారుజామున పెంచలయ్య బెడ్‌పై లేకపోవడంతో అతని కోసం గాలించారు. అయితే ఆయన తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని సెక్యూరిటీ సిబ్బంది గుర్తించి ఐసీయూకు తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం చికిత్స పొందుతూ పెంచలయ్య మృతి చెందాడు. కుమారుడు మంగళవారం రాత్రి దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇన్‌స్పెక్టర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ జీజీహెచ్‌కు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. రెండవ అంతస్థు మహిళా వార్డులోని కిటికీకి పెంచలయ్య పంచె చిక్కుకుని ఉండటంతో దానిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కిటికీలోనుంచి దూకి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్‌ఐ వెంకటస్వామి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధి నిర్వహణలో డిపార్టుమెంట్ అధికారి మృతి



కమలహాసన్(ఫైల్)

ఉదయగిరి రూరల్, మార్చి 6: ఉదయగిరి ఏఆర్ఆర్ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రంలో డిపార్టుమెంట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న పఠాన్ కమలహాసన్(43) అస్వస్థతకు గురై మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. కడప జిల్లా బద్వేల్ పట్టణానికి చెందిన కమలహాసన్ మర్రిపాడు జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 1 నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ఉన్నతాధికారులు ఉదయగిరి ఏఆర్ఆర్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రానికి డిపార్టుమెంట్ అధికారిగా నియమించారు. ఈతరుణంలో బుధవారం విధులకు హాజరైన ఆయన పరీక్షా కేంద్రంలో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వైద్యం కోసం సమీపంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని బద్వేల్‌కు తరలించారు. కమలహాసన్ మృతి పట్ల పలువురు అధ్యాపకులు, సిబ్బంది సంతాపం తెలియచేశారు.

మూడు లారీల ఢీ : డ్రైవర్‌కు గాయాలు



ఢీకొన్న లారీలు

కోవూరు, మార్చి 6: కోల్‌కతా- చెన్నై జాతీయ రహదారిపై మండల పరిధిలోని పడుగుపాడు సమీపంలో బుధవారం వేకువజామున మూడు లారీలు ఢీకొన్న ఘటనలో ఓ లారీ డ్రైవరుకు గాయాలయ్యాయి. పోలీ సుల కథనం మేరకు.. విజయవాడ నుంచి చెన్నై వైపు స్పేర్ పార్టు లోడుతో వెళ్తున్న లారీ అదే మార్గంలో ముందు వెళ్తున్న లారీని ఢీకొని రోడ్డు మార్జిన్‌లో ఆగిపోయింది. కొద్ది సమయం తరువాత ఆ లారీని అదే మార్గంలో వస్తున్న కొరి యర్ కార్గో సర్వీసు లారీ ఢీకొంది. ఈ ఘట నలో కొరియర్ కార్గో లారీ డ్రైవర్ తంబికి గాయాల య్యాయి. సమాచారం అందుకున్న పోలీసు లు ఘటనా స్థలిని పరిశీలిం చారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలిం చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	128
లేయర్ లైవ్	70
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	250
లేయర్	120

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6165
వెండి కిలో ధర	రూ. 73,900
వెండి ఒక గ్రాము	రూ. 76.90

రోడ్డుప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

సంగం, మార్చి 6: రోడ్డుప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వంగల్లు రహదారిలో బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. సురేష్ అనే యువకుడు వంగల్లులోని తన ఇంటి నుంచి మెయిన్ రహదారిలోకి నడిచి వస్తుండగా బుచ్చి వైపు నుంచి మర్రిపాడు వైపు వెళ్తున్న మోటారుబైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సురేష్ తలకు తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అతన్ని బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరుకు తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు చైన్నైకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

కేటుగాళ్ల అరెస్ట్

● నకిలీ సర్టిఫికెట్లతో బాండ్లు ● ఇన్సూరెన్స్ సంస్థను బురిడీ కొట్టించాలని యత్నం



నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

నెల్లూరు(క్రైం), మార్చి 6: ఇన్సూరెన్స్ సంస్థలో ఫోర్జరీ సర్టిఫికెట్లతో పాలసీలు చేయించి రూ.కోట్లు దోచేయాలని చూసిన కేటుగాళ్లను దర్గామిట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లో బుధవారం రాత్రి నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గూడూరు మాళవ్యనగర్‌కు చెందిన పోలంరెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట, చెవిమెల ప్రాంతానికి చెందిన వలిదాస్ అంజయ్య మిత్రులు. వారికి ఇన్సూరెన్స్ పాలసీలు చేయించడంలో మంచి అనుభవం ఉంది.

బండారం ఇలా బయట పడింది

టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఇన్సూరెన్స్ పాలసీ చేసేందుకు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంక్ స్టేట్‌మెంట్, శ్యాలరీ సర్టిఫికెట్, మెడికల్ సర్టిఫికెట్ ఉండాలి. ఈ క్రమంలో నిందితులు ఇద్దరు ఒక వ్యక్తి ఆధార్ కార్డు అడ్రస్‌ను, ఇంకొక వ్యక్తి అడ్రస్‌గా చూపిస్తూ, ఏదో ఒక సంస్థలో పనిచేస్తున్నట్లు నకిలీ శాలరీ సర్టిఫికెట్ పొంది, దానిపై నకిలీ బ్యాంకు అకౌంట్‌ను సృష్టించారు. ఈ డాక్యుమెంట్లను పాలసీ బజార్ కంపెనీకి పంపారు. వారు టాటా ఏఐఏ ఇన్సూరెన్సు కంపెనీ పాలసీదారుల అర్హతలను చెక్ చేసుకోకుండానే వారి కంపెనీతో లింక్ అయిన హాస్పిటల్‌లో మెడికల్ చేయించారు. అందరికీ విజయ హాస్పిటల్‌లో మెడికల్ పరీక్షలు చేయించారు. దీంతో అందరికీ పాలసీ బాండ్లు ఇప్పించారు. ఇక్కడి వరకు అన్నీ నిందితులు అనుకున్నట్లే జరిగాయి. అయితే పాలసీ బాండ్లు తయారు చేసిన వ్యక్తుల్లో ఒక చనిపోయిన వ్యక్తి డెత్ క్లెయిమ్, వేరే ఇన్సురెన్స్ కంపెనీ దగ్గర జరిగినట్లు ఈవైకేసీ ద్వారా టాటా ఏఐఏ కంపెనీ వారికి తెలిసింది. దాని ఆధారంగా కంపెనీ వారు విచారణ జరపగా నిందితులు చేయించిన పాలసీలు అన్నీ నకిలీవిగా గుర్తించారు. దీంతో నిందితులు చేసిన పాలసీలను రద్దు చేసి గత నెల 22వ తేది నెల్లూరు టాటా ఏఐఏ లైఫ్ ఇన్సురెన్స్ ఆపరేషన్ మేనేజర్ దర్గామిట్ట పోలీసులకు నిందితులపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం సాయంత్రం నిందితులను బట్వాడిపాలెం సెంటర్ వద్ద అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి వివిధ కంపెనీల రబ్బర్ స్టాంపులు 8, సిమ్‌కార్డులు 7, పలు బ్యాంకు పాస్‌పుస్తకాలు, పలు బ్యాంకులకు సంబంధించిన డెబిట్ కార్డులు, పాన్‌కార్డులు, ఆధార్‌కార్డులు, ఖాళీ అపాయింట్మెంట్ లెటర్, సంతకం చేసిన అప్పాయింట్మెంట్ లెటర్, పర్సనల్ కంప్యూటర్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈ కేసులో నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు పాలసీదారులను, విజయ వైద్యశాల సిబ్బందిని, శాలరీ సర్టిఫికెట్ జారీ చేసిన సంస్థలను దర్యాప్తు చేయాల్సి ఉందని తెలిపారు. ఈ సమావేశంలో దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఖాజా అల్తాఫ్‌హుస్సేన్, ఎస్‌ఐ బీ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో పథకం

ఇన్సూరెన్స్ పాలసీలు కడితే రూ.లక్షలు వస్తాయని ప్రజలకు మాయమాటలు చెప్పి వారిని ఒప్పించారు. ఇన్సూరెన్స్ చేసేందుకు అర్హత లేకపోయినా అర్హతలు ఉన్నవారిగా చూపించేందుకు కావలసిన నకిలీ డాక్యుమెంట్లను తయారు చేసి పాలసీలు ఇప్పించారు. తర్వాత వారి పేరున వచ్చిన పాలసీ బాండును తమ దగ్గర ఉంచుకొని పథకం ప్రకారం ఒక సంవత్సరం తర్వాత పాలసీదారుడు మరణించినట్లు చిత్రీకరించి దాని ద్వారా వచ్చే రూ.కోట్ల రూపాయల ఆదాయాన్ని చెరిసగం పంచుకునేలా పథకం రచించారు. అందులో భాగంగా మొదటగా వారికి తెలిసిన కొంతమందిని ఎంచుకుని ఒక్కో పాలసీదారుడి నుంచి రూ.2 లక్షలు వసూలు చేశారు. ఈ విధంగా 14 మందిపై ఇద్దరు నిందితులు పాలసీలు చేశారు. చనిపోయిన ముగ్గురు వ్యక్తులపై కూడా పాలసీలు చేసి లబ్ధి పొందాలని భావించారు.

9న దివ్యాంగుల మహాగర్జన

● సూరిపాక వాసుదేవరావు మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న సూరిపాక వాసుదేవరావు మాదిగ

నెల్లూరు (హరనాథ పురం), మార్చి 6 : ఈనెల 9న అమరావతిలో దివ్యాంగుల మహా గర్జన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీనిని విజయవం తం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి సూరిపాక వాసుదేవరావు మాదిగ కోరారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో వీహెచ్‌పీ ఎస్ జిల్లా అధ్యక్షుడు తాటిపర్తి అంకబాబు ఆధ్వర్యంలో బుధవారం కార్యకర్తల సమా వేశం జరిగింది. వాసుదేవరావు మాట్లాడుతూ దివ్యాంగుల పింఛను రూ.6వేలకు పెంచా లని కోరారు. శారీరక వైకల్యం కలిగిన వారికి వివాహంతో సంబంధం లేకుండా అంత్యోదయ రేషన్ కార్డుద్వారా 35 కేజీల బియ్యం అందచేయాలని, తన పింఛను పునరు ద్ధరించాలని కోరారు. అమరావతిలో జరిగే మహాగర్జనకు జిల్లా వ్యాప్తంగా ఉన్న వీహెచ్‌పీ ఎస్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎంఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్‌కృష్ణ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు పందిటి అంబేడ్కర్ మాదిగ, వీహెచ్‌పీఎస్ జాతీయ నాయకుడు గూడూరు వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

'హంస'కు ప్రభుత్వ గుర్తింపు

● సంఘం జిల్లా అధ్యక్షుడు చేజర్ల



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

నెల్లూరు (వైద్యం), మార్చి 6 : వైద్య ఆరోగ్యశాఖలోని హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస)ను ప్రభుత్వం మొదటిసారిగా గుర్తించిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్ రావు తెలిపారు. బుధవారం నెల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవోఎంఎస్ నెంబర్ 24 ద్వారా 'హంస'ను గుర్తిస్తున్నట్లు ప్రకటించిందని చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖ లో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్‌కు ప్రత్యేక అభినందనలు తెలియచేస్తున్నా మన్నారు. అసోసియేషన్ గుర్తింపు కోసం పోరాడిన కర్నూలు జిల్లా అధ్యక్షుడు రఘుబాబు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాజాకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. జిల్లాలోని అన్ని తాలూకాలలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో హంస జిల్లా ప్రధాన కార్యదర్శి కమల్ కిరణ్, కోశాధికారి శేషగిరిరావు, నాయకులు మజురుల్లా, శశికళ, వరప్రసాద్, ఖాదర్‌బాషా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి రూ.3.5 లక్షల విరాళం



ఆలయ ఈవో గిరికృష్ణకు చెక్కు అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 6 : జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయ గోవులకు గోశాల నిర్మాణం కోసం నెల్లూరు రూరల్ మండలం కొత్తవెల్లంటికి చెందిన మారం పాపిరెడ్డి, సవడమ్మ దంపతులు వారి కుటుంబ సభ్యులు బుధవారం రూ.3.50 లక్షలు విరాళంగా అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఆలయ ఈవో వి.గిరికృష్ణకు అందజేసి రసీదు పొందారు. అనంతరం దాతల గోత్రనామాలతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

9 నుంచి పౌరహక్కుల సంఘం ముగింపు సభలు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 6 : పౌర హక్కుల సంఘం 50 వసంతాల ముగింపు సభలు ఈ నెల 9, 10తేదీల్లో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతాయని నెల్లూరు జిల్లా పౌర హక్కుల సంఘం నాయకుడు అబ్బాయిరెడ్డి, ఉపాధ్యక్షులు ఎన్ కేశవులు, గురుస్వామి, సహాయ కార్యదర్శి కే సుబ్బారావు, కార్యదర్శి ఎల్లంకి వెంకటేశ్వర్లు తెలిపారు. ముగింపు సభల పోస్టర్లను బుధవారం జర్నలిస్టు భవనంలో ఆవిష్కరించారు. ప్రజల హక్కులను హరించే నల్ల చట్టాలపై పౌర హక్కుల సంఘం 1973 నుంచి అలుపెరుగని పోరాటం చేస్తోందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 వసంతాల సభలు జరిగాయని తెలిపారు.

సోమశిలలో 14.940 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా బుధవారం నాటికి జలాశయంలో 14.940 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 450 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు సంసిద్ధం కావాలి : కలెక్టర్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (హర నాథపురం), మార్చి 6 : ఎన్నికల నిర్వహణ కు సంసిద్ధం కావాలని కలెక్టర్ హరినారాయ ణన్ అధికారులకు పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ లోని తిక్కన భవన్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారు లతో ఆయన సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియలో 16 నోడల్ బృందాల పాత్ర కీలకమని చెప్పారు. ఆ 16 విభాగాల సమష్టి భాగస్వామ్య కృషితో ఎన్నికలను విజయ వంతంగా పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఆర్వోలు ప్రధాన బాధ్యత తీసుకుని ముం దుండి ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాల ని సూచించారు. ప్రతి ఈఆర్వో, సెక్టార్ అధికారి తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేసి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. ఎన్నికల సంఘం అనేక ఐటీ అప్లికేషన్లను తయారు చేసిందని, ప్రతి యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికలకు సిద్ధం కావాలంటూ దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో జేసీ సేతు మాధవన్, నగర కమిషనర్ వికాస్ మర్మత్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి రాయితీని సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 6: తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇచ్చిన పెట్టుబడి రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హరినారాయణ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో ఖరీఫ్ సీజన్‌లోవర్షాభావం వల్ల, రబీలో మిచౌంగ్ తుఫాన్ వల్ల పంటలు నష్టపోయిన రైతులకు రూ.2.65 కోట్ల నగదు, మెగా చెక్కును అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావం వల్ల నష్టపోయిన ఉద్యాన వన పంటల రైతులు 3,822 మందికి రూ.2.32 కోట్లు, పంటలు దెబ్బతిన్న 425 మంది రైతులకు రూ.33 లక్షలు పెట్టుబడి సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి పీ సత్యవాణి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి బీ సుబ్బారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీ నిరంజన్‌రెడ్డి, వైఎస్ఆర్ హార్టికల్చర్ బోర్డు సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, రైతు సంఘ ప్రతినిధులు కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణభారత్ ట్రస్ట్‌లో నేడు వైద్య శిబిరం

● ప్రారంభించనున్న పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య

వెంకటాచలం, మార్చి 6 : వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆవరణలో గురువారం మధ్యాహ్నం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఐ దీపావెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తమ ట్రస్ట్ సౌజన్యంతో నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాల, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ శిబిరాన్ని పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకు కేన్సర్, నరములు, మానసిక వ్యాధులు, కీళ్లు, ఎముకలు, చెవి, ముక్కు, కంటి, గొంతు, చర్మ, గర్భకోశ, సాధారణ వ్యాధులకు వైద్యసేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. కంటి శుక్లాలతో బాధపడే వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని, పాత రిపోర్ట్‌లను తప్పనిసరిగా తీసుకురావాలని పేర్కొన్నారు.

9న బీజేపీ సమావేశం

● హాజరుకానున్న శివరాజ్‌సింగ్ చౌహాన్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 6: బీజేపీ నేత, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహన్ ఈ నెల 9వ తేదీ నెల్లూరుకు రానున్నారు. ఆయన నగరంలోని వీఆర్సీ మైదానంలో సాయంత్రం 4 గంటలకు బీజేపీ కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర కమిటీలతో సమావేశం అవుతారని పార్టీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి తెలిపారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ ఇసుక కుంభకోణం, గ్రావెల్, మైనింగ్ మాఫియాలో కూరుకు పోయిందని విమర్శించారు. శివరాజ్‌సింగ్ చౌహాన్ సమావేశానికి జిల్లాలోని బీజేపీ రాష్ట్ర, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, సీనియర్ కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు 27,256 మంది హాజరు



పరీక్షల సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్ఐవో శ్రీనివాసులు

నెల్లూరు (విద్య): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన ప్రథమ సంవత్సరం జనరల్ మ్యాథ్స్-1ఏ, బోటనీ-1, సివిక్స్-1తో పాటు ఒకేష నల్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 27,256 మంది హాజరయ్యారు. 81 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు జనరల్ విద్యార్థులు 26,913 మందికిగాను 26,104 మంది హాజరు కాగా 809 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1,322 మందికి 1,152 మంది హాజరు కాగా 170 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మీద 28,235 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 27,256 మంది హాజరయ్యారు. 979 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ తీరును ఆర్ఐవో డాక్టర్ శ్రీనివాసులు, డీవీఈవో మధుబాబు, డీఈసీ సభ్యులు, స్క్వాడ్ కలిపి మొత్తం 39 కేంద్రాలను పరిశీలించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

నెల్లూరు(క్రైం), మార్చి 6: ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై ఓ కార్మికుడు మృతి చెం దాడు. పోలీసుల సమాచారం మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మహారాజ్‌గంజ్ జిల్లా, శీతల్‌పూర్ గ్రామానికి చెందిన సంతోష్, నూర్ హసన్ అన్సారీ(19), ధ్రువపాశ్వాన్ ఉపాధి నిమిత్తం నెల్లూరుకు వచ్చారు. బీవీ నగర్‌కు చెందిన కార్పెంటర్ మేస్త్రీ గురు మూర్తి వద్ద పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. కొద్దిరోజులుగా బీవీనగర్‌లో భరణికుమార్ ఇంటికి కార్పెంటర్ పనులు చేస్తున్నారు. మంగళవారం రాత్రి 8గంటల ప్రాంతంలో మూడో అంతస్థులో పనిచేస్తుండగా అన్సారీ విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన సంతోష్, ధ్రువపాశ్వాన్ హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. బుధవారం తెల్లవారుజామున సంతోష్ వేదాయ పాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వైద్యశాలకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడూరుపాడులో ఉద్రిక్తత

● హద్దురాళ్లు పీకేసిన రెవెన్యూ అధికారులు

● పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



హద్దు రాళ్లను తీసుకెళ్తున్న రెవెన్యూ సిబ్బంది

నెల్లూరు రూరల్, మార్చి 6 : నెల్లూరు రూరల్లోని కోడూరుపాడు వద్ద బుధవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ సర్వే నెం. 550,411,435,538,39,40లలో 30 ఎకరాలు పెన్నా పోరంబోకు భూమి ఉంది. అందులో నారాయణరెడ్డిపేటకు చెందిన పేదలు 380 మంది 12 అంకణాల చొప్పున ప్లాట్లు వేసుకుని ఇళ్ల నిర్మాణాలకు సిద్ధమయ్యారు. ఏడాదిన్నర నుంచి ఈ ప్రక్రియ జరుగుతున్నప్పటికీ తాజాగా రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి హద్దురాళ్లు పీకేయడం వివాదస్పదంగా మారింది. ఈ ప్రాంతానికి చెందిన వైసీపీ ముఖ్యనేత కోడూరు కమలాకర్ రెడ్డి ఇటీవల చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన నేపథ్యంలో తాజా సంఘటన రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. పెన్నా పోరంబోకు భూమిని ఆక్రమించారంటూ తొలుత రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు ఆపై హద్దురాళ్లు నాటుకున్న నారాయణరెడ్డిపేట వాసుల స్థలాలను, రోడ్లను చిన్నాభిన్నం చేశారు. వీరంతా కోడూరు కమలాకర్‌రెడ్డి వర్గానికి చెందిన వారుగా సమాచారం. హద్దు రాళ్లు తొలగించడాన్ని కొందరు అడ్డుకోవడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది.

కల్లూరుపల్లిలో....

కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో ఇలాంటి సంఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాంతానికి చెందిన తారాబాయ్ అనే మహిళ రోడ్డు మార్జిన్‌లో టిఫిన్ అంగడి నడుపుతూ జీవనం సాగిస్తోంది. సచివాలయ సిబ్బంది హఠత్తుగా వచ్చి పట్టలతో వేసుకున్న దుకాణాన్ని కూల్చి వేశారని వాపోయింది. రోడ్డును ఆక్రమించుకుని షాపులు నిర్మించుకున్న వారిని వదిలేసి పట్టలతో గుడారం వేసుకున్న తనపై ప్రతాపం చూపడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

విద్యార్థి దశలో కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



సీతారామపురం :సరస్వతీ పూజలో పాల్గొన్న ఎంఈవో, సర్పంచ్,ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఉదయగిరి, మార్చి 6: విద్యార్థి దశలో కష్టపడితే చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రధానోపాధ్యాయుడు మాలకొండయ్య అన్నారు. బుధవారం మండలంలోని గడ్డంవారి పల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు సరస్వతి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధిస్తే తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు సంపాదించవచ్చని అన్నారు. పులుగుళ్ల వెంకటరాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గతేడాది పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. అలాగే పాఠశాలలో సరస్వతి పూజకు అవసరం నిమిత్తం రూ.50 వేలు నగదును ట్రస్టు సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరీముల్లాహుస్సేన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఏఎస్ పేట: స్థానిక ఠాగూర్ పాఠశాలలో బుధవారం సరస్వతీ పూజ నిర్వహించారు. త్వరలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న సందర్భంగా విద్యార్థులు సరస్వతీ పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి, హెచ్ఎం దొరస్వామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతారామపురం: మండల పరిధిలోని సీతారామపురం హైస్కూల్, గౌతమి హైస్కూల్, బసినేనిపల్లి హైస్కూల్స్‌లో పదోతరగతి విద్యార్థులు బుధవారం సరస్వతి పూజ నిర్వహించారు. సీతారామపురం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ఎంఈవో షేక్ మస్తాన్‌వలి, సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి విచ్చేసి సరస్వతి పూజలో పాల్గొన్నారు.

వింజమూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సరస్వతీ పూజ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం మాలకొండయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల ఉన్నత పాఠశాలల్లో బుధవారం విద్యార్థులు సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. పెద్దిరెడ్డిపల్లిలో పచ్చవ లక్ష్మయ్య కుమారులు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయగా ప్యాడ్లు, పెన్నులను ఆంగ్ల ఉపాధ్యాయులు రావిళ్ల నాగార్జున అందజేశారు. అలాగే వలంటీరు వంశీ జామెంటరీ బాక్సులను అందించారు. కార్యక్రమంలో ఎంఈవో రమణయ్య, ప్రధానోపాధ్యాయులు చలపతి, మాలకొండయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతీదేవి పూజ

అల్లూరు : అల్లూరుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు గదులను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ మేరకు బుధవారం సరస్వతీ పూజ నిర్వహించారు. విద్యా కమిటీ ఛైర్మన్ మేడా రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ చెంచయ్య పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆలయాల ముస్తాబు


ముస్తాబవుతున్న మొగిలిచెర్ల దత్తాత్రేయ ఆలయం

లింగసముద్రం, మార్చి 6 : ఈ నెల 8న జరగనున్న మహాశివరాత్రి పండుగకు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మొగిలిచెర్ల దత్తాత్రేయస్వామి ఆలయం, లింగసముద్రంలోని తిరుమణిశెట్టి కోటయ్య మందిరం ముస్తాబయ్యాయి. భక్తులు స్వామి వారిని దర్శించుకొనేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొగిలిచెర్లకు రాష్ట్రం నుంచే కాక తెలంగాణాతో పాటు పలు నగరాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేస్తారు. దీంతో పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే కందుకూరు, కావలి డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ చెప్పారు.

మొగిలిచర్లకు ప్రత్యేక బస్సులు

కావలి : మహాశివరాత్రిని పురస్కరించుకుని లింగసముద్రం మండలం మొగిలిచర్లలో వెలసి ఉన్న దత్తాత్రేయ స్వామి దర్శనార్థం కావలి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం రాపూరు శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు కావలి నుంచి సాయిపేట, కొమ్మి, కలిగిరి రూట్లలో ఈ ప్రత్యేక బస్సులు తిరుగుతాయన్నారు. కావలి నుంచి కలిగిరి మీదుగా 10 బస్సులు, కొమ్మి మీదుగా 8 బస్సులు, సాయిపేట మీదుగా 7 బస్సులు నడుతున్నామని పేర్కొన్నారు.

సోమేశ్వరుడుని పట్టించుకోరా?


ముస్తాబు లేక బోసిబోయిన సోమేశ్వరాలయం

బిట్రగుంట, మార్చి 6: మహాశివునికి అతిప్రీతి కరమైన శివరాత్రి పర్వదినం రోజు కూడా సోమేశ్వరుడుని పట్టించుకోరా అని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోగోలు మండలం జక్కేపల్లి గూడూరులో వెలసి ఉన్న కామాక్షి సమేత సోమేశ్వరస్వామి ఆలయం ప్రాచీన ఆలయాల్లో ఒక్కటి. దాతల సహకారంతో స్వామివారి ఉత్సవాలు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. సోమేశ్వరస్వామి ఆస్తులు అధికంగా ఉన్నా పూజలు విషయంలో దేవాదయ శాఖ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా దేవాదయ శాఖ అధికారులు స్పందించి శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు.

సింహ వాహనంపై భీమేశ్వరస్వామి గ్రామోత్సవం


సింహ వాహనంపై భీమేశ్వరస్వామి

సంగం, మార్చి 6: మండలంలోని వంగల్లులో ఉన్న భీమేశ్వరాలయంలో జరుగుతున్న మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా క్షామాక్షిదేవి, భీమేశ్వరస్వామికి భక్తులు పూలంగిసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వెంగమాంబ సేవలో కాకర్ల

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 6: మండలంలోని నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలమ్మ తల్లిని బుధవారం నియోజకవర్గ టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఆత్మకూరు, మార్చి 6: రక్తదానం ప్రాణదానంతో సమానం అని ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం తెలిపారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో అపోలో డయాలసిస్ ఇన్‌చార్జ్ రవి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ ఉషాసుందరి, అపోలో వైద్యశాల డయాలసిస్ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ భవనాలు ప్రారంభం

కలువాయి, మార్చి 6: కలువాయి, తెలుగు రాయపురం, గోపవరం గ్రామాల్లో సచివాలయాలను బుధవారం తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి వెంకటగిరి వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డితో కలసి ప్రారంభించారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ప్రజలందరూ ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బి అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మీదేవి, సర్పంచు పెంచలమ్మ, మండల ఉపాధ్యక్షులు పంగా పెంచల నరసారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సేవాసంఘం జిల్లా అధ్యక్షుడిగా పవన్

సంగం, మార్చి 6: నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా జండాదిబ్బకు చెందిన సూరాయపాళెం పవన్‌కుమార్ నియమింపబడ్డారు. ఈ మేరకు ఆయన బుధవారం సేవాసంఘం జాతీయ అధ్యక్షుడు గుంటుపల్లి నాగేశ్వరావు చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు

బీసీల సంక్షేమమే టీడీపీ ధ్యేయం : కురుగొండ్ల


మహిళలకు కరపత్రాలు అందిస్తున్న కురుగొండ్ల

కలువాయి, మార్చి 6: బీసీల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయం అని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. కలువాయి మండలంలోని వెరుబొట్లపల్లి, కనుపూరుపల్లి గ్రామాల్లో బుధవారం భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అమలుచేసే పథకాల గురించి ఆయన మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా కురుగొండ్ల మాట్లాడుతూ 40ఏళ్లగా అక్కున చేర్చుకున్న బీసీల రుణం తీర్చుకునేందుకు చంద్రబాబునాయుడు బీసీ డిక్లరేషన్ ప్రకటించారని తెలిపారు. వైసీపీ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎన్నికల్లో బీసీలు సైకిల్ గుర్తుపై ఓటు వేసి చంద్రబాబు నాయుడును సీఎం చేయాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు జగదల్ నాయడు, పీర్ల సోమయ్య యాదవ్, కిషోర్‌రెడ్డి, గద్దె వెంకటేశ్వర్లు, చంద్రయ్య నాయడు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పల్స్‌పోలియో కార్యక్రమం పరిశీలన


సంగం: చిన్నారిని పరిశీలిస్తున్న అధికారి

సంగం, మార్చి 6: మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని కేంద్ర బృందం మానిటరింగ్ అధికారి సురేష్ పరిశీలించారు. బుధవారం ఆయన మండలంలోని దువ్వూరు సచివాలయం పరిధిలోని దళితవాడలో ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేశారా లేదా అని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అశోక్ కుమార్, క్షేత్రస్థాయి వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్ పేట: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని తెల్లపాడు, గండువారిపల్లిలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మానిటరింగ్ అధికారి సురేష్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు డా. మంజుల, ఎంపీహెచ్‌వో ఎం చిన్నయ్య, పిహెచ్ఎన్ వై నీరజ, ఎంపిహెచ్ఎస్ రషీద్, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి : సీపీఎం


సంతకాల సేకరణలో సీపీఎం నాయకులు

ఆత్మకూరు, మార్చి 6: పట్టణంలోని సోమశిల రోడ్డు సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సీపీఎం నాయకులు బుధవారం ఆత్మకూరు పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి వద్ద సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సందాని మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులు జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇకనైనా భూసేకరణకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ

వింజమూరు, మార్చి 6: పట్టణంలోని శివాలయం ఎదురుగా ఆర్యవైశ్యులచే కన్యకాపరమేశ్వరి ఆలయం నిర్మించేందుకు బుధవారం గోపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ త్వరగా పూర్తిచేయాలి

సీతారామపురం, మార్చి 6: ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించి ఈకేవైసీ త్వరగా పూర్తిచేయాలని సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ సూచించారు. బుధవారం ఆయన సీతారామపురం బిట్-1 సచివాలయాన్ని తనిఖీ చేసి పలు రిజిష్టర్లు పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ రమేష్ చంద్ర, ఇంజనీర్ అసిస్టెంట్ సుమతి వెటర్నరీ అసిస్టెంట్, సచివాలయాల సిబ్బంది హాజరయ్యారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి

వరికుంటపాడు, మార్చి 6: ఆరోగ్య సురక్ష పథకం కింద అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి అన్నారు. బుధవారం వేంపాడులో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మమ్మ సర్పంచ్ తాత పూడి విజయమ్మ, వైద్యులు ఆయేషా, కోటేశ్వరరావు, గవదకట్ల మల్లికార్జున, తాతపూడి అబుసలాం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: మండలంలోని నేలటూరు సచివాలయం గడ్డంవారిపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి నాగూర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన మేకపాటి

ఉదయగిరి, మార్చి 6: నెల్లూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని బుధవారం ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కావలి సమీపంలో ఘన స్వాగతం పలికారు. ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు.

బీసీ డిక్లరేషన్‌తో ఎంతో ఉపయోగం : ఇంటూరి


ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న నాగేశ్వరరావు

కందుకూరు, మార్చి 6: తెలుగుదేశం పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తో బీసీలకు ఎంతో మేలు జరుగుతుందని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి పట్టణంలోని 3వ వార్డు ఉప్పుచెరువు ప్రాంతంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాల అమలు గురించి, స్థానిక సమస్యలు తెలుసుకుంటూ టీడీపీ మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, పువ్వాడి కోటయ్య, చిలకపాటి మధుబాబు, వడ్డెళ్ల రవిచంద్ర, రెబ్బవరపు మాల్యాద్రి, రాయపాటి శ్రీనివాసరావు, మున్నా, సలాం తదితరులు పాల్గొన్నారు.

17వ వార్డులో ప్రచారం

తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు పట్టణంలోని 17వ వార్డు బీసీ కాలనీలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య ఆధ్వర్యంలో బుధవారం శంఖారావం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆమె కాలనీలో ఇంటింటికీ తిరిగి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దివి శ్రీనివాసరావు, యనమల రాజేశ్వరి, తన్నీరు లక్ష్మి, సుగుణ, మరియమ్మ, కత్తి ఆశీర్వాదం పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు మహిళలు చేరిక


టీడీపీలో చేరిన మహిళలతో కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, మార్చి 6: బీజేపీ మాజీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు, కాపు నేత పద్మావతి శ్రీదేవి తన అనుచరులతో కలసి బుధవారం టీడీపీలో చేరారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో పార్టీలో చేరిన ఆమెతో పాటు 20 కుటుంబాల వారికి కావలి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రతి ఒక్కరికి పార్టీలో సముచిత స్థానం కల్పించి అందరి సహకారంతో కావలిని అభివృద్ధి పథంలో నడుపుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, 18వ వార్డు ఇన్‌చార్జి శానం హరి తదితరులు పాల్గొన్నారు.

34వ వార్డులో టీడీపీ ఎన్నికల ప్రచారం

కావలి పట్టణంలోని 3వ క్లస్టర్ ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటేశర్లు అధ్యక్షతన మాజీ కౌన్సిలర్ మలిశెట్టి విజయలక్ష్మి బుధవారం 34వ వార్డులో టీడీపీ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని, పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు లోకేష్, సుందర శ్రీనివాస్, రామయ్య, హరీష్, వినోద్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

కావలిలో జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపిస్తాం

కావలి, మార్చి 6: కావలిలో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపిస్తామని పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ నియోజకవర్గ అధ్యక్షుడుగా ఎన్నికైన ఆలా శ్రీనాథ్, పట్టణ అధ్యక్షుడు మన్నేపల్లి రుషికేష్‌లు తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో బుధవారం జనసేన కావలి ఇన్‌చార్జి అళహరి సుధాకర్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అఖిల భారత చిరంజీవి యువత గౌరవాధ్యక్షుడు నాగబాబు సూచనల మేరకు జిల్లాతో పాటు కావలిలో పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ నూతన కమిటీని నియమించామన్నారు. నూతనంగా ఏర్పడిన కమిటీకి జనసేన ఇన్‌చార్జి సుధాకర్ శుభాకాంక్షలు తెలిపారు.

పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ నూతన కమిటీ :

పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ కావలి నియోజకవర్గ అధ్యక్షుడిగా ఆలా శ్రీనాథ్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మల విద్యాసాగర్, కార్యదర్శిగా మండ శ్రీను, కోశాధికారిగా సూరిపోగు రాజేష్ లను నియమించారు. పట్టణ అధ్యక్షుడిగా మన్నెపల్లి రుషికేష్, ప్రధాన కార్యదర్శిగా భవనాసి రాంబాబు, ఉపాధ్యక్షుడుగా కామిశెట్టి మురళీకృష్ణ, రూరల్ కమిటీ అధ్యక్షుడిగా గుడిపల్లి వెంకయ్యగౌడ్, ఉపాధ్యక్షుడిగా వాయిల వెంకయ్యబాబులను నియమించారు.

ఇంటూరి నాగేశ్వరరావుకు టికెట్ కేటాయించాలి

లింగసముద్రం, మార్చి 6 : కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావుకు టికెట్ కేటాయించాలని ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి ముళ్లపాటి మహేష్ చౌదరి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో కష్టాల్లో ఉన్న వారిని ఆదుకొంటూ ప్రజల మనస్సు గెలిచారని, అలాగే గెలుపు రేసులో మొదటి స్థానంలో ఉన్నారని తెలిపారు. 20 ఏళ్ల తర్వాత టీడీపీ జెండాను ఎగుర వేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ అధిష్ఠానం నాగేశ్వరరావుకు టికెట్ కేటాయించి కార్యకర్తల అభీష్టాన్ని గుర్తించాలని తెలిపారు.

డివిజనల్‌స్థాయి క్రికెట్ విజేత బిట్రగుంట లోకో టీం

బిట్రగుంట, మార్చి 6: సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ బిట్రగుంట బ్రాంచ్ ఆధ్వర్యంలో ఏడు రోజులుగా జరిగిన విజయవాడ డివిజనల్ స్థాయి క్రికెట్ పోటీలలో బిట్రగుంట లోకో టీం బుధవారం విజేతగా నిలిచింది. బిట్రగుంట సంఘ్ బ్రాంచ్ కార్యదర్శి రాజశేఖర్, రన్నింగ్ బ్రాంచ్ కార్యదర్శి జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 40 జట్లు తలపడ్డాయి. ఫైనల్స్‌లో రాయంపాడు వర్క్‌షాపు - బిట్రగుంట జట్లు హోరాహోరిగా తలపడగా బిట్రగుంట జట్టు విన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకు పీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్ ట్రోఫీతో పాటు నగదు బహుమతి అందజేశారు. రన్నర్‌గా నిలిచిన రాయంపాడు జట్టుకు రైల్వే వైద్యుడు రమణరావు బహుమతి అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘ్ బ్రాంచ్ అధ్యక్షుడు గోవిందరాజు, అసిస్టెంట్ డివిజనల్ కార్యదర్శి జీ.శ్రీనివాసులు, సభ్యులు కిరణ్‌కుమార్, మురళీ, స్టేషన్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

వలేటివారిపాలెం, మార్చి 6 : జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దారు నాగమల్లేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలు, బూత్ ఏజెంట్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని, ఓటరు లిస్టులో డబుల్ ఎంట్రీలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, తాగునీరు, ఫ్యాన్‌లు, మరుగుదొడ్లు తదితర వసతులు కల్పించాలని తెలిపారు.

ఏరియా వైద్యశాలలో మహిళా దినోత్సవం

కావలి, మార్చి 6 : కావలి ఏరియా వైద్యశాలలో బుధవారం మహిళా దినోత్సవం జరిగింది. వైద్యశాల సూపరింటెండెంట్ పద్మావతి, ఆర్ఎంవో ప్రమీల, నర్సింగ్ సూరింటెండెంట్ ప్రసన్న తదితరులు మహిళాదినోత్సవం యొక్క ఆవశ్యకతను గురించి వివరించారు. మహిళా వైద్యులు, నర్సులు, పారా మెడికల్, శానిటరీ, సిబ్బంది తదితరులు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ పద్మజ, డాక్టర్ ఉషారాణిలు ఆసుపత్రికి 36 కుర్చీలు, బీరువాను బహూకరించారు.

మృతుడి కుటుంబానికి కావ్య పరామర్శ

అల్లూరు, మార్చి 6 : మండలంలోని ఇందుపూరుకు చెందిన టీడీపీ నాయకుడు అంబటి రాజేంద్ర తండ్రి అంబటి గోపాలయ్య ఇటీవల మరణించగా బుధవారం ఆయన కుటుంబాన్ని కావలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కావ్య కృష్ణారెడ్డి పరామర్శించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసులు, అరగల రమణయ్య, హజరత్తయ్య, దాసరి వెంకటేశ్వర్లు, ఎందేటి హరికృష్ణ, కావలి జగన్ పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాలకు వేలం

కందుకూరు, మార్చి 6: రవాణా శాఖ తనిఖీలలో భాగంగా సీజ్‌చేసి వాటిని విడిపించుకునేందుకు యజమానులు ఆసక్తి చూపని వాహనాలకు బుధవారం కందుకూరులో వేలం నిర్వహించగా రూ.4.85 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆర్‌టీవో సుధాకరరెడ్డి తెలిపారు. కందుకూరు ఎంవీఐ ఎస్కేఎండీ రఫీ, ఇతర రవాణా శాఖ అధికారులతో కలిసి ఆయన వేలం ప్రక్రియలో పాల్గొన్నారు. మొత్తం 26 వాహనాలను వేలం వేయగా ఈ మొత్తం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో కావలి ఎంవీఐ సుందరరావు, ఏవో సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ల బహూకరణ

కలిగిరి, మార్చి 6: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి పాలూరు మాలకొండారెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా రెండు వాటర్‌కూలర్‌లను వారి కుమారులు, జడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, కలిగిరి పంచాయతీ ఉపసర్పంచు పాలూరు కొండారెడ్డిలు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పొగాకుబోర్డు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇద్దరూ అవినీతి పరులే : పసుపులేటి


మాట్లాడుతున్న పసుపులేటి

కావలిటౌన్, మార్చి 6: కావలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులిద్దరూ అవినీతిపరులేనని పీఎస్సార్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం ట్రస్ట్ కార్యాలయం వద్ద ప్రచార రథాలు ప్రారంభించిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. దేశంలోనే మొదటి ఇండిపెండెంట్ అభ్యర్థిగా మేనిఫెస్టో ప్రకటించి ఆదర్శంగా నిలుస్తానన్నారు. ఒక ప్రధాన పార్టీ తనని పిలిచి మంచి కార్యక్రమాలు చేస్తున్నావు మాపార్టీలో రమ్మని ఆహ్వానించారని, తీరా ఎన్నికల సమయంలో టికెట్ ఇవ్వలేమని చెప్పారన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని, గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కోదండరాముడికి లక్ష తులసి పూజ



కందుకూరు, మార్చి 6: పట్టణంలోని పెద్ద బజారులో ఉన్న కోదండరాముడికి బుధవారం లక్ష తులసి పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు రామనామస్మరణ చేస్తూ తులసిని స్వామివారికి సమర్పించటంతో ఆలయ ప్రాంగణం రామనామస్మరణతో మార్మోగింది. పట్టణంలోని ఆర్యవైశ్య వ్యాపారులంతా దుకాణాలు మూసివేసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీ సత్యనారాయణస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ మురారిశెట్టి వెంకటసుబ్బారావు, శ్రీను, ఆలయ అర్చకులు రామచంద్రాచార్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక రక్షణ చట్టం బీసీలకు వరం


డిక్లరేషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ నేతలు

కావలి, మార్చి 6: ప్రత్యేక రక్షణ చట్టం బీసీలకు వరమని, 50 ఏళ్లకే పెన్షన్ అమలు చేయటం హర్షణీయమని బీసీ నేతలు పేర్కొన్నారు. స్థానిక ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం బీసీసెల్ రాష్ట్ర అధికారప్రతినిధి ఉప్పుటూరు బాలగురుస్వామి, రాష్ట్ర బీసీ సాధికారిక కమిటీ సభ్యుడు కావేటి చినకోటయ్య, బీసీసెల్ కావలి పట్టణ అధ్యక్షుడు గుండ్లపల్లి శివాజీ, ఉపాధ్యక్షుడు పసుపులేటి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఏటూరి శివకుమార్, యువత అధ్యక్షుడు పూడిపర్తి మురళీక్రిష్ణలు సమావేశమై బీసీ డిక్లరేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీసీ డిక్లరేషన్‌ను ప్రజలకు వివరించి కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు కమ్మిశెట్టి రమణయ్య, గంజాం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి విద్యార్థులకు అట్టల పంపిణీ

వలేటివారిపాలెం, మార్చి 6 : వలేటివారిపాలెం హైస్కూల్‌లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థి కొల్లు కిషోర్ బుధవారం అట్టలు, పెన్నులు, జామెంట్రీబాక్సులు పంపిణీ చేశారు. ముందుగా ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కమల్‌కుమార్, ఉపాధ్యాయులు చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, కత్తి ఐజాక్, సుబ్బరామయ్య, యోగా టీచరు ఈర్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.



కల్పవృక్ష వాహనంపై కల్యాణ వేంకటేశ్వరుడి దర్శనం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 6 : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని రామకృష్ణానగర్‌లో కొలువైవున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారు కల్పవృక్ష వాహనంపై బుచ్చి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో చతుస్థానార్చన, నిత్య హోమం, నిత్యపూర్ణాహుతి, మంగళశాసనం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదములు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలకు తుమ్మల పెంచలరెడ్డి, తోట శ్రీనివాసులురెడ్డి కుటుంబాలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కాగా గురువారం స్వామివారికి చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

పంగిలిలో ఆరోగ్య సురక్ష

రాపూరు(డక్కిలి), మార్చి 6 : మండలంలోని పంగిలి గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు, ఆరోగ్యశ్రీ కార్డులు అందచేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నర్మద, నాజ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

పొదలకూరు, మార్చి 6 : పట్టణంలోని డీఎన్‌ఆర్ జడ్పీ బాలుర, బాలికల హైస్కూల్‌లో 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు రూరల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమర్తలూరు చెంచయ్య ఆధ్వర్యంలో ఆర్యవైశ్య నేతల ఆర్థిక సహాయంతో పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె సనత్‌కుమార్, పెర్సిస్, సునందలు దాతలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన హాకీ జట్టుకు రూ.4వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రూరల్ వర్కింగ్ సెక్రటరీ పొట్టి సుధాకర్, పొదలకూరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సురేష్‌బాబు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుర్రం మధు, జిల్లా యువజన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాజా సురేంద్రబాబు, మండల యువజన సంఘం అధ్యక్షుడు పైడా కామేశ్వరరావు, కార్యదర్శులు చిట్లూరు సుబ్రహ్మణ్యం, పిన్నెల ప్రభాకర్, ఆకులూరు విజయ్, డాక్టర్ జొన్నలగడ్డ బ్రహ్మయ్య, సుజీవన్, కొలిశెట్టి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ

పొదలకూరు, మార్చి 6 : పట్టణంలోని నాగార్జున పబ్లిక్ స్కూల్‌లో బుధవారం సరస్వతీ పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అడ్వైజర్లు గాయత్రి, ఎన్ లక్ష్మీదుర్గ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలన్నారు. పట్టణానికి చెందిన వేగమ సుబ్బారావు స్వామి సరస్వతి పూజను జరిపించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. పాఠశాల చీఫ్ అడ్వైజర్ ఎన్ బాలు, విజ్ఞాన్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ అన్నం సుబ్బారావు, అకడమిక్ ఇన్‌చార్జ్ ఎ చంద్రశేఖర్‌యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొంత నిధులతో కాలువ పూడికతీత

విడవలూరు, మార్చి 6: కాలువల పూడికతీత పనులను పాలకులు, అధికారులు చెయ్యకపోవడంతో రైతులే నడుంబిగించి సొంత నిధులతో కాలువ మరమ్మత్తు పనుల చేసిన ఘటన ముదివర్తిలో బుధవారం జరిగింది. గ్రామంలోని కట్రాగు కాలువ సుమారు 150 ఎకరాలు సాగునీరు అందింటంతోపాటు పులకనీరు పోయ్యేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. గత కొద్దినెలలుగా ఈ కాలువ గుర్రపు డెక్కతో నిండి సాగునీరు అందక పొలాలు ఎండుతున్నాయి. ఈ విషయాన్ని సంబంధిత ఇరిగేషన్ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో స్థానిక రైతులు రాజారెడ్డి, మల్లికార్జునరెడ్డి, నారాయణరెడ్డి, ఎస్‌కె ఖాదర్ బాషా, రఫీలు, రైతులు సయంగా కాలువ పూడిక తీయించారు.

వెంకయ్యనాయుడిని కలిసిన గ్రామస్థులు

వెంకటాచలం, మార్చి 6 : జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉన్న పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడిని బుధవారం పలువురు చవటపాళెం గ్రామస్థులు కలిశారు. అలాగే పలువురు బీజేపీ నాయకులు, వెంకయ్య అభిమానులు కూడా కలిసి పద్మవిభూషణ్ పురస్కారం లభించడం పట్ల అభినందనలు తెలిపారు.



వెంకయ్య నాయుడిని కలిసిన పలువురు చవటపాళెం గ్రామస్తులు, ఆయన అభిమానులు

స్థాయిని మరిచి సోమిరెడ్డిపై విమర్శలు విడ్డూరం

ముత్తుకూరు, మార్చి 6: మండల వైసీపీ నాయకులు వారి స్థాయిని మరిచి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై విమర్శలు చేయడం విడ్డూరం గా ఉందని టీడీపీ మండల ఐటీ విభాగం నాయకుడు తిరుమలశెట్టి సతీష్‌నాయుడు అన్నారు. బ్రహ్మదేవం టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కల్తీ మద్యం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న పోలిరెడ్డి చిన్నపరెడ్డి సైతం సోమిరెడ్డిపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. ముత్తుకూరు మండలంలో సోమిరెడ్డి హయాంలో జరిగిన అభి వృద్ధిపై చర్చకు తాము సిద్ధమన్నారు. వ్యవసాయ మంత్రి కాకాణి అభివృద్ధి పేరిట శిలాఫలకాలు వేసుకుని ఆర్భాటాలు చేయడం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ నాయకులు షేక్ అలిముత్తు, నన్నం దీనయ్య, పల్లాల రవీంద్ర, నాగేంద్ర, శివప్రసాద్, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధినేత దృష్టికి ఈబీసీల సమస్యలు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 6: ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమంలో బీసీలు, ఈబీసీలు కోల్పోతున్న పలు ప్రభుత్వ పథకాలను టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని కోవూరు ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. బుధవారం బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని 6, 7 వార్డుల పరిధిలో దినేష్‌రెడ్డి ఆవార్డుల ఇన్‌చార్జిలు సుల్తాన్‌బాషా, షబ్బీర్‌బాషాలతో కలిసి ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ. శేషయ్య, హరికృష్ణ, సర్దార్, కాలేషా, షామీర్, నందాని, రాఘవరెడ్డి, హరనాథ్, రామానాయుడు, వుసురుపాటి, కిషోర్, తాళ్లస్వామి, మైనారిటీలు పాల్గొన్నారు.

ఇందుకూరుపేటలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ఇందుకూరుపేట : స్థానిక జిల్లా ప్రజా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామ సర్పంచు ఈదూరు పద్మమ్మ ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, డాక్టర్ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో రోగులకు వైద్య సేవ లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయిలహరి, ఈవోపీఆర్‌డీ వసుంధర, అగ్రికల్చర్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు గుణపాటి సురేష్‌రెడ్డి, హెచ్‌ఈవో శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ రమ, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై ఎన్నికల సిబ్బందికి అవగాహన

రాపూరు(డక్కిలి), మార్చి 6 : ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓటింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, బీఎల్వోలు, వీఆర్వోలకు మాస్టర్ ట్రైనర్ వెంకటయ్య ఈవీఎం మిషన్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు సునీల్, సురేఖ, ఎంఇవో శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ అధికారి సోమసుందర్, ఇరిగేషన్ శాఖ ఏఇ సర్దార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ అంజనేయులు, టీజీపీ ఇఇ విజయకుమార్, తెలుగుగంగ ఎఇ వెంకటరాజేష్, హౌసింగ్ ఎఇ రామకృష్ణ, పంచాయతీ రాజ్ ఎఇ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అంతర జిల్లాల కబడ్డీ పోటీలకు సర్వం సిద్ధం

కోవూరు, మార్చి 6: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం నుంచి మూడు రోజు ల పాటు జరగనున్న 70వ అంతర్ జిల్లాల పురుషుల చాంపియన్‌షిప్ కబడ్డీ పోటీలకు సర్వం సిద్ధం చేశారు. క్రీడా ప్రాంగణంలో తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు సూచనలు చేశారు. అసోసియేషన్ కార్యదర్శి లవకుమార్, సహాయ కార్యదర్శి జూగుంట విజయానందం, ఉపాధ్యక్షుడు పూండ్ల జాన్సన్, గ్రౌండ్ ఇన్‌చార్జి ఎస్ అమర్ కబడ్డీ కోర్టు ప్రాంగణంలో ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు.

విద్యుత్ ఉత్పత్తి ప్లాంటును సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్

తోటపల్లిగూడూరు, మార్చి 6 : విద్యుత్ ఉత్పత్తి ప్రైవేటు కంపెనీ అయిన ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్)ను బుధవారం అసిస్టెంట్ కలెక్టర్ వి సంజనాసిన్హా సందర్శించారు. తక్కువ బొగ్గుతో విద్యుత్ ఉత్పత్తి చేయడంతోపాటు అతి తక్కువ కార్బన్‌ను విడుదలచేసే సూపర్ క్రిటికల్ టెక్నాలజీ గురించి ఆమె కంపెనీ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట కంపెనీ ఆపరేషన్ హెడ్ ప్రవీణ్‌కుమార్, రిలియాబిలిటీ హెడ్ జేవీఎల్‌హెచ్ నాగేశ్వరరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు కార్పొరేట్ వైద్యసేవలు

మనుబోలు, మార్చి 6 : జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామీణ ప్రాంతాలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందుతాయని ప్రభుత్వ వైద్యాధికారిని గేయ పూజిత అన్నారు. మండలంలోని గురివిందపూడి గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ మన్నెమాల సమతమ్మ ఆధ్వ ర్యంలో నిర్వహించారు. గ్రామంలో ఏఎన్ఎం అమరా వతి ఆధ్వర్యంలో 334 మందికి వైద్య పరీక్షలు నిర్వ హించి మందులు అందజేసినట్లు తెలి పారు. కార్యక్ర మంలో స్థానిక వైసీపీ నాయకుడు మన్నెమాల సుధీర్ రెడ్డి, జనరల్ మెడిసిన్ వైద్యుడు ఎం మధు, జనరల్ సర్జరీ వైద్యుడు ప్రసాద్, పీఎంవో ఏ వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి అనితమ్మ, తదితరులున్నారు.

వైభవంగా షిరిడీ సాయిబాబా మందిరం వార్షికోత్సవ వేడుకలు

పొదలకూరు, మార్చి 6 : పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో 19వ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం కాకడ హారతి, పంచామృత అభిషేకం, ధుని పూజలు, తీర్థ ప్రసాదాల వినియోగం, అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం విష్ణు సహస్ర నామపూజలు, సాయం సంధ్య హారతి నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయకర్తలుగా పులి పాటి వెంకటరత్నం నాయుడు, సుమతి దంపతులు వ్యవహరించారు. రాత్రి గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

కాకాణిని ఓడించడమే జనసేన లక్ష్యం : బొబ్బేపల్లి

వెంకటాచలం, మార్చి 6 : రాబోయే ఎన్నికల్లో సర్వేపల్లిలో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఓడించి ఇంటికి పంపించడమే సర్వేపల్లి జన సేన పార్టీ లక్ష్యమని ఆపార్టీ సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొబ్బేపల్లి సురేష్ నాయుడు అన్నారు. మండలంలోని ఇడిమేపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న పలుకూరివారిపాళెం చెరువును బుధవారం ఆయకట్టు రైతులు, జనసైనికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాన్ వల్ల చెరువు దెబ్బతిందన్నారు. కనీసం దెబ్బతిన్న చెరువులను పరిశీలించే తీరిక మంత్రి కాకాణికి లేకుండా పోయిందని విమర్శించారు. రాబోయే ప్రజాప్రభుత్వంలో దెబ్బతిన్న చెరువులకు మరమ్మతులు చేయడంతోపాటు రెం డో పంటకు సాగునీరు అందించి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పినిశెట్టి మల్లికార్జున్, శ్రీహరి తదితరులున్నారు.

అక్రమ గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న వీఆర్వో

బుచ్చిరెడ్డిపాళెం: నాగమాంబాపురం పంచాయతీ విలియమ్స్‌పేటలో జగనన్న లేఔట్ల పరిసరాలలోని ప్రభుత్వ భూమిలో బుధవారం వైసీపీ నాయకులు అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. సర్వే నెంబరు 248ఏ, 248బీలలోని భూమిలో గ్రావెల్ తవ్వకాలు చేపట్టి టిప్పర్లతో తరలించారు. దీనిపై రైతులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వీఆర్వో అడ్డుకున్నారు.

నెల్లూరు సిటీ, రూరల్

కోవూరు, సర్వేపల్లి

స్నాతక సంబరం

ప్రభుత్వ వైద్యకళాశాలలో డిగ్రీ పట్టాల పంపిణీ









చంద్రబాబుతో సోమిరెడ్డి భేటీ

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), మార్చి 6 : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బుధవారం అమరావతిలో భేటీ అయ్యారు. చంద్రబాబు పిలుపు మేరకు అమరావతి వెళ్లిన సోమిరెడ్డి సుమారు గంటపాటు జిల్లా రాజకీయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి నియోజక వర్గ వ్యవహారం కూడా చర్చకు వచ్చింది. నియోజకవర్గంలో జరుగుతున్న ఐఈఆర్ఎస్ సర్వేను సోమిరెడ్డి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. అలానే రానున్న ఎన్నికల్లో తన అభ్యర్థిత్వంపై కూడా చర్చించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాలను చంద్రబాబుకు వివరించారు. ఈ భేటీపై సోమిరెడ్డి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ పొత్తులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ నాయకుల సీట్లను ఖరారు చేయలేదని, రెండో జాబితాలో మంచి నిర్ణయాలు ఉంటాయని చంద్రబాబు వెల్లడించినట్లు చెప్పారు.



చంద్రబాబుతో పెంచలయ్య చౌదరి

పెంచలయ్య చౌదరి భేటీ

నెల్లూరు (వైద్యం), మార్చి 6 : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడును టీడీపీ నేత పెంచలయ్య చౌదరి బుధవారం కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో చంద్రబాబును కలిసి శాలువాతో సన్మానించారు. నెల్లూరు సిటీలో టీడీపీ గెలుపుకోసం కృషి చేయాలని పెంచలయ్యకు చంద్రబాబు సూచించారు. చౌదరి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన కూటమి విజయం సాధిస్తుందని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు.

50 ఏళ్లకే పింఛన్ : అజీజ్

నెల్లూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం-జనసేన కూటమి అధికారంలోకి రాగానే బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ హామీ ఇచ్చారు. బుధవారం రాత్రి నగరంలోని 52వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైసీపీ పాలనలో బీసీలు ఎన్నో దాడులు ఎదుర్కొన్నారని, తాము అధికారంలోకి రాగానే బీసీల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు యశ్రబ్, వెంకయ్య యాదవ్, పాషా మొహిద్దీన్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బీసీ డిక్లరేషన్‌కు స్వాగతం

- బీసీ సంఘాల నాయకుల బైక్‌ర్యాలీ

నెల్లూరు(హరనాథపురం), మార్చి 6 : తెలుగుదేశం పార్టీ మంగళగిరిలో నిర్వహించిన జయహో బీసీ సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను స్వాగతిస్తూ బీసీ సంఘాల నాయకులు నగరంలో బుధవారం సాయంత్రం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో 17 బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర బీసీ సంఘం నాయకుడు ఒట్టూరు సంపత్‌రాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు చట్టబద్ధత కల్పించారన్నారు. వైసీపీ ఇప్పటికే ఉమ్మడి నెల్లూరు జిల్లాలో బీసీల కోసం రెండు స్థానాలు ప్రకటించటం జరిగిందన్నారు. టీడీపీ ఒక్క స్థానాన్ని కూడా ప్రకటించకపోవటం బీసీలలో ఆందోళన రేకెత్తిస్తోందన్నారు. ఈ ర్యాలీలో నాయకులు పీఎల్‌రావు, శ్రీరామ్‌నాగేంద్ర, బొమ్మి నాగకిషోర్, పలమల శ్రీహరిరావు జనార్ధన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ సామాజిక న్యాయానికి నాంది

నెల్లూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ-జనసేన కూటమి ప్రకటించిన బీసీ డిక్లరేషన్ సామాజిక న్యాయానికి నాంది అని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు అన్నారు. బుధవారం నగరంలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన పది హామీలు అద్భుతమని కొనియాడారు. సంపదను సృష్టించి ప్రజలకు అందించడం ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 20 శాతానికి తగ్గించిందని, అయితే టీడీపీ-జనసేన అధికారంలోకి రాగానే మళ్లీ రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు.

జనసేన నగర కార్యాలయం ప్రారంభం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 6: నగరంలోని ఏసీ నగర్‌లో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ నెల్లూరు నగర కార్యాలయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జనసైనికు లకు అందుబాటులో ఉండేలా ఈ కార్యాలయాన్ని నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు ఏర్పాటు చేశారని చెప్పారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో జనసేన-టీడీపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాల్సిన అవసరం ఉందని, ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. సుజయ్ మాట్లాడుతూ నగర ప్రజలకు ఏ కష్టం వచ్చినా జనసేన కార్యాలయానికి వచ్చి చెప్పుకోవచ్చుని, ప్రజా సమస్యలపై జనసేన అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ ఆలియా, అజయ్‌బాబు, కంతర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయ ప్రారంభోత్సవంలో నాయకులు

ఎమ్మెల్యే కోటంరెడ్డితో వేమిరెడ్డి భేటీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 6: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డితో పలు అంశాలపై చర్చించారు. కాగా, రూరల్ నియోజకవర్గం 35వ డివిజన్‌లోని ప్రగతి నగర్, లేక్‌వ్యూ కాలనీ, లక్ష్మీనరసింహపురం, బషీర్‌నగర్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి కోటంరెడ్డి సుజితమ్మ, కుమార్తెలు హైందవి, వైష్ణవి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కోటంరెడ్డిని కలిసిన వేమిరెడ్డి

నెల్లూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని కోటంరెడ్డి నివాసానికి వెళ్లిన వీపీఆర్.. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. సిటీలో నారాయణ, ఎంపీగా వేమిరెడ్డి భారీ మెజారిటీతో గెలవబోతున్నారని కోటంరెడ్డి వ్యాఖ్యానించారు.

పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు..

నెల్లూరు(హరనాథపురం) : ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ బుధవారం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. గ్రామ సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను వీపీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఆ చాంబర్ ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మునిరెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు ధనుంజయ యాదవ్ పాల్గొన్నారు.

మద్దతు తెలిపిన పడమటి కంభంపాడు గ్రామస్థులు

ఆత్మకూరు నియోజకవర్గంలోని పడమటి కంభంపాడు గ్రామస్తులు బుధవారం వీపీఆర్ నివాసానికి వెళ్లి ఆయనకు మద్దతు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లక్ష్మీరెడ్డి, సర్పంచి కత్తి లావణ్య, పెంచలయ్య, నరసారెడ్డి, సాంబయ్యనాయు డు, వెంకటరమణారెడ్డి, దాసరి విజయ్ పాల్గొన్నారు.



కోటంరెడ్డితో కరచాలనం చేస్తున్న వీపీఆర్

రేపు బ్రహ్మంగారి కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 6 : నగరంలోని విరాట్‌నగర్‌లో గల గాయత్రీదేవి, విశ్వకర్మ భగవాన్, గోవిందమాంబ సమేత పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఆలయ చైర్మన్ కందుకూరి చెంగయ్య ఆచారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 5గంటల నుంచి సుప్రభాతసేవ, అభిషేకాలు, పూలంగిసేవ, కల్యాణ మహోత్సవం, హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదానం జరుగుతాయన్నారు. భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

రేపు భక్తిగీతాలాపన పోటీలు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం ఉదయం నెల్లూరు మినీటౌనుహాలులో భక్తిగీతాలాపన పోటీలు నిర్వహిస్తున్నట్లు సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుమాటి రాధాకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏ వయసు వారైనా పోటీల్లో పాల్గొనవచ్చని, జూనియర్, సీనియర్ విభాగాలు ఉంటాయని తెలిపారు. విజేతలు, పోటీదారులకు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తిగల వారు 78938 47709 నెంబరును సంప్రదించాలని కోరారు.

కాటేపల్లికి ప్రత్యేక బస్సులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 6: మహాశివరాత్రి పర్వదినము సందర్భంగా ఆర్టీసీ నెల్లూరు-2వ డిపో ఆధ్వర్యంలో నగరంలోని ఆత్మకూరు బస్టాండు నుంచి కాటేపల్లికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని డిపో మేనేజర్ శివకేశవ యాదవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 9వ తేది ఉదయం 10 గంటల వరకు 5 ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. వీటిలో రూ.40 చార్జీ మాత్రమే వసూలు చేస్తారని, భక్తులు ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణాలు చేయాలని కోరారు.

అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయండి

నెల్లూరు(హరనాథపురం), మార్చి 6 : జిల్లాలో 2019 నుంచి 2024 వరకు ఎన్నికోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. 2014 నుంచి 2019 వరకు ఎన్నికోట్లతో అభివృద్ధి పలు చేశారు.. అనే అంశమై శ్వేతపత్రం ప్రకటించాలని టీడీపీ రైతు రాష్ట్ర కార్యదర్శి ఆలూరు వెంకేశ్వర్లుచౌదరి ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో టీడీపీ ప్రభుత్వంలో మంజూరై సగం పూర్తయిన పనులకు ఎందుకు నిధులు కేటాయించటం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

నేడు ప్రపంచ మహిళా దినోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 6 : ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ నెల్లూరు డివిజన్ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు డివిజన్ కో ఆర్డినేటర్ కళాంజలి అనంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం సాయంత్రం 6 గంటలకు టౌనుహాలు రీడింగ్ రూమ్‌లో జరుగుతుందని, మహిళలు అందరూ తరలిరావాలని కోరారు.

నేడు పుస్తకావిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 6 : తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వంగల్లు కోదండరామిరెడ్డి జీవిత విశేషాల పుస్తకావిష్కరణ గురువారం జరగనుంది. నగరంలోని కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణంలోగల రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియంలో ఉదయం 10.30గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుంది. మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

వామపక్ష పార్టీలను ఆదరించండి


- ఎన్నికల ప్రచారం ప్రారంభం

నెల్లూరు (వైద్యం), మార్చి 6 : వామపక్ష పార్టీలను బలపరచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ప్రజలను కోరారు. బుధవారం ఎన్నికల ప్రచారాన్ని సీపీఎం మాజీ కార్యదర్శి చంద్ర రాజగోపాల్ పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. రమేష్ మాట్లాడుతూ బీజేపీని బలపరుస్తున్న వైసీపీ, టీడీపీ, జనసేనను వ్యతిరేకించాలని కోరారు. నెల్లూరు సిటీ అభివృద్ధి కోసం సీపీఎం ప్రజాపోరాటాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాదాల వెంకటేశ్వర్లు, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నేతలు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, మూలం ప్రసాద్, నరసింహా, రమణారెడ్డి, పద్మ, సుబ్బమ్మ, చిరంజీవి, అల్లంపాటి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 6 : నగరంలోని బాలాజీనగర్ సాయిదర్బార్ వద్ద బుధవారం తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం 5గంటల నుంచి గురువు లక్ష్మీసాయి ఆధ్వర్యంలో నిర్విరామంగా పండరి భజనలు, కోలాటాలు జరిగాయి. ఈ కార్యక్రమాన్ని గురువులు కొలపూడి శ్రీను, తులసీరామ్, సాయిదర్బార్ అధ్యక్షుడు మధుసాయి, గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య పర్యవేక్షించారు.



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 7 మార్చి 2024



దశకంఠుడిపై భవుడి విలాసం



ముక్కంటి శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జగద్రక్షకుడైన పరమశివుడు రావణ బ్రహ్మ వాహనంపై కొలువుదీరగా, జ్ఞానప్రసూనాంబ మయూర వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై శ్రీవల్లి, దేవసేన సమేత కుమార స్వామి, చండీకేశ్వరుడు, భక్తకన్నప్ప కొలువుదీరి ఊరేగారు.ఉదయం ఆలయ అలంకార మండపంలో వేదపండితులు స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో పూజలు చేసి పురవిహారానికి తీసుకువచ్చారు.వాయులింగేశ్వరుడు హంస వాహనంపై, జ్ఞానప్రసూనాంబ యాళి వాహనంపై అధిరోహించి పురవీధుల్లో ఊరేగారు. కోలాటాలు, బ్యాండు వాయిద్యాల సందడి, శివనామస్మరణలతో చతుర్మాడ వీధులు మార్మోగాయి.

- శ్రీకాళహస్తి

తిరుమలేశుడి సేవలో జూనియర్ శ్రీదేవి

దివంగత సినీనటి శ్రీదేవి కుమార్తె, హీరోయిన్ జాన్వీకపూర్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆమె బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తన పిన్నమ్మ అయిన నటి మహేశ్వరితో కలిసి ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. జాన్వీకపూర్‌కు వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.ఆలయం ముందు జాన్వీకపూర్‌ను చూసేందుకు యాత్రికులు ఉత్సాహం చూపారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి

అవార్డందుకున్న వినుకొండ



ప్రముఖ డోలు విద్వాంసుడు వినుకొండ సుబ్రమణ్యం బుధవారం కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డును అందుకున్నారు.గూడూరు మాళవ్యానగర్‌కు చెందిన ఆయన ఆలిండియా రేడియో టాప్‌గ్రేడ్ ఆర్టిస్టుగా 40 సంవత్సరాలకు పైగా దేశమంతా డోలు కచేరీలు చేశారు. సుబ్రమణ్యం ప్రావీణ్యతను గుర్తించిన కేంద్ర సంగీత నాటక అకాడమీ ఆయన్ను అవార్డుకు ఎంపిక చేసింది.ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బుధవారం పురస్కారాన్ని స్వీకరించారు.పలువురు కళాకారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

- గూడూరు

మంత్రి సమావేశానికి హాజరు కాకుంటే చర్యలు!

మహిళా టీచర్లకు పుత్తూరు డీవైఈవో హెచ్చరిక

పుత్తూరు అర్బన్, మార్చి 6: మహిళా దినోత్సవం పేరుతో మంత్రి రోజా నిర్వహించతలపెట్టిన సమావేశానికి మహిళా టీచర్లు హాజరు కాకుంటే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ పుత్తూరు డీవైఈవో హెచ్చరిక జారీ చేశారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం వున్న నేపథ్యంలో మంత్రి రోజా ఒక రోజు ముందుగానే 7వ తేదీన సాయంత్రం 4 గంటలకు పుత్తూరు ఎన్జీవో కాలనీ సమీపంలోని షాదీ మహల్‌లో సమావేశం జరపాలని నిర్ణయించారు. ఎన్నికల నేపథ్యంలో రోజా ఏదో ఒక వర్గంతో సమావేశమై మద్దతు కోరుతున్న మంత్రి రోజా ఈ సమావేశానికి మహిళా టీచర్లను రప్పించాలని ఆదేశించారో లేదో తెలియదు గానీ పుత్తూరు డీవైఈవో మాత్రం ఎంఈవో 1, ఎంఈవో 2లతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు వాట్సప్ మెసేజీలు పంపించారు. మంత్రి నిర్వహిస్తున్న సమావేశానికి మహిళా టీచర్లు తప్పనిసరిగా హాజరు కావాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని అందులో స్పష్టం చేశారు.మహిళా దినోత్సవం ముందు రోజే నిర్వహిస్తుండడం ఒకటైతే, సాయంత్రం 4 గంటలకు సమావేశానికి రావాలంటే స్కూళ్ల నుంచీ టీచర్లు పని వేళలు ముగియక ముందే బయల్దేరాల్సి వుంటుంది. నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న ఈ పనులకు మళ్లీ బెదిరింపులేమిటని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.మంగళవారం పుత్తూరులో అంగన్వాడీ కార్యకర్తలతో ఇదే విధంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. దీనికి కూడా మంత్రి రోజా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి కూడా ఖచ్చితంగా రావాలని అంగన్వాడీలపై ఒత్తిడి తీసుకురావడం వివాదాస్పదమైంది.అధికార పార్టీ నేతలకు సంబంధించిన కార్యక్రమాలన్నింటికీ బెదిరింపులు, హెచ్చరికలతో ఆయా వర్గాలను హాజరు చేయించడానికి అధికారులు యత్నిస్తున్న తీరు విమర్శలకు దారి తీస్తోంది.

8 కిలోల గంజాయి పట్టివేత

గూడూరు, మార్చి 6:స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని పట్టుకుని 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ రమేష్ చెప్పారు.గూడూరు ఎస్ఈబీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రానికి చెందిన జయకుమార్, గుణశేఖరన్ బస్టాండు సమీపంలోని వినాయకుడి గుడి వద్ద తచ్చాడుతుండగా తనిఖీ చేశామన్నారు. వారి వద్ద రెండు బ్యాగుల్లో రూ. 40వేల విలువచేసే 8 కేజీల గంజాయి ఉండటాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకున్నామన్నారు.అనకాపల్లికి చెందిన అరుణ్ అనే వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి చెన్నైకి చెందిన ప్రసాద్‌కు అందజేస్తే వీరికి రూ. 10వేల వంతున ఇస్తామని చెప్పడంతో గంజాయిని తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు.ఎస్ఐలు బ్రహ్మనాయుడు, మోసెస్ తదితరులు పాల్గొన్నారన్నారు.

మిచౌంగ్ తుఫాన్ పరిహారం విడుదల

తిరుపతి(కలెక్టరేట్),మార్చి 6:మిచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం వారి ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది డిసెంబరులో సంభవించిన మిచౌంగ్ తుఫాను కారణంగా వ్యవసాయ పంటలకు సంబంధించి నష్టపోయిన 5,650 మంది రైతులకు రూ.5,00,935కోట్లు, ఉద్యాన పంటలకు సంబంధించి 1,346మంది రైతులకు రూ.89.85లక్షల పంట నష్ట పరిహారాన్ని జమ చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్, జిల్లా ఉద్యానశాఖాధికారి దశరధరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న, కలెక్టర్ లక్ష్మీశ

కాల్వవంకలో కబ్జాపర్వం

పోటాపోటీగా అక్రమ నిర్మాణాలు

రేణిగుంట, మార్చి 6 : రేణిగుంట పంచాయతీ పరిధిలోని వివేకానంద కాలనీ పక్కన వున్న కాల్వ వంక, పొరంబోకు దాని పక్కన ఉన్న ప్రభుత్వ భూముల్లో వైసీపీ నాయకులు నిర్మాణాలు చేపడుతున్నారు.వివేకానంద కాలనీ పక్కన వున్న వంక పొరంబోకులో సర్వే నెంబరు 831లో 14.28ఎకరాల పొరంబోకు భూమి ఉంది. పట్టణానికి చెందిన వైసీపీ నాయకురాలు అక్రమ నిర్మాణాలు చేపట్టి విక్రయించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.రెవెన్యూ అధికారులు గతంలో రెండుసార్లు నిర్మాణాలను అడ్డుకున్నప్పటికీ నిర్మాణాలు కొనసాగుతున్నాయి.ఈ విషయంపై స్థానిక కమ్యూనిస్టు పార్టీ నేతలు తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఏమైందో కానీ మరుసటి రోజు మరో పక్క ప్రభుత్వ భూమిని కబ్జాచేసి వాళ్లూ నిర్మాణాలు మొదలుపెట్టారు. వైసీపీ నాయకుల కబ్జాలను తొలగిస్తే తామూ తొలగిస్తామంటున్నారు.ఈ అక్రమ నిర్మాణాలతో కాల్వ పరిమాణం తగ్గిపోయింది.భారీ వర్షాలు పడితే కాలువలో నీరు ముందుకు పోయే పరిస్థితి లేకపోవడంతో సమీపంలో ఉన్న ఇళ్లపైకి వస్తాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ నాయకురాలు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలు





పోటాపోటీగా కమ్యూనిస్టులు నిర్మిస్తున్న నిర్మాణాలు

రుయాలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

- ప్రారంభించిన ఆస్పత్రి వైద్యాధికారులు

తిరుపతి సిటీ, మార్చి 6 : తిరుపతి రుయా ఆస్పత్రిలో పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభు బుధవారం వైద్య సేవలను ప్రారంభించారు. చంద్రశేఖరన్ మాట్లాడుతూ పేద రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో మొదటి విడతగా ఐదు విభాగాల్లో ఈ సేవలను అందిస్తున్నామన్నారు. సోమ, బుధ, శుక్ర, శనివారాల్లో ఈ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 50 పడకలు అందుబాటులో ఉన్నాయని, ఇందుకుగాను గత నెలలో 10 మంది సూపర్ స్పెషాలిటీ వైద్యులను నియమించామని చెప్పారు. కార్డియో తురాసిక్ మస్క్యులర్ సర్జన్ డాక్టర్ కళ్యాణి, మెడికల్ ఆంకాలజీ డాక్టర్ రవిశంకర్, సర్జికల్ ఆంకాలజీ డాక్టర్ సి.అఖిలేష్, రేడియో ఆంకాలజీ డాక్టర్ చండీప్రియ, రేడియేషన్ సేఫ్టీ ఆఫీసర్ వీసీ సాహిత్య, నెఫ్రాలజీ డాక్టర్ సునీత, డాక్టర్ ఎస్. పావని, ఏఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ, రుయా ఆస్పత్రి అడ్మిన్ డాక్టర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సూపర్ స్పెషాలిటీ ఓపీ వివరాలు..

- బుధ, శనివారాలు: కార్డియో తురాసిక్ వేస్క్యులర్ సర్జరీకి ఓపీ ఉంటుంది
- సోమ, గురువారం: నెఫ్రాలజీ విభాగం ఓపీ
- బుధ, శుక్రవారం: మెడికల్ ఆంకాలజీ ఓపీ
- సోమ, బుధ, శుక్రవారాలు: సర్జికల్ ఆంకాలజీ, రేడియో థెరపీ విభాగాల్లో ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయి.

చిత్తూరుకు ఏమీ చేయలేకపోయా

- హామీలే తప్ప సహకరించని సీఎం
- ఎమ్మెల్యే, రాజ్యసభ టికెట్ ఇస్తానని మోసం
- వైసీపీకి రాజీనామా చేసిన ఆరణి
- నేడు పవన్ సమక్షంలో జనసేనలో చేరిక

చిత్తూరు సిటీ, మార్చి 6: 'చిత్తూరు నియోజకవర్గంలోని సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి గురించి పలుమార్లు సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లా. ప్రతిసారి హామీలు ఇచ్చారే తప్ప, ఒక్క పనికీ సహకరించలేదు. ఈ ఐదేళ్ల చిత్తూరుకు ఏమీ చేయలేకపోయా' అని వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆవేదన వ్యక్తంచేశారు. చిత్తూరులోని తన నివాసంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. వైసీపీ ప్రభుత్వ తీరు, తనకు జరిగిన అవమానాల గురించి వివరించారు. వైసీపీకి రాజీనామా చేసిన ఆయన, గురువారం జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గంలో రోడ్ల గుంతలు పూడ్చడానికి కూడా నిధులు ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వంలో వేసిన రోడ్లు పూర్తిచేయడానికి రూ.20 కోట్లు అవసరమని అడిగినా రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. 'ఐదేళ్లుగా నన్ను ఆదరించిన చిత్తూరు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు. సీఎం జగన్, వైసీపీ అధిష్ఠానం సూచించిన అన్ని కార్యక్రమాలను నేను చిత్తశుద్ధితో నిర్వహించా. చాలావాటిలో రాష్ట్రంలోనే నెంబర్ వన్ ఎమ్మెల్యేగా స్థానం సంపాదించుకున్నా. చిత్తూరు టికెట్ మళ్లీ నాకు ఇస్తానని రెండేళ్ల కిందట సీఎం జగన్ హామీ ఇచ్చారు. వైసీపీ బస్సుయాత్ర సభలోనూ నన్నే ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు. గత నెలలో సీఎంను కలిసినప్పుడు ఎమ్మెల్యే టికెట్ కాకుండా రాజ్యసభ ఇస్తానని, తర్వాత ఏపీఐఐసీ ఛైర్మన్ పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. తీరా అదికూడా లేకుండా మోసం చేశారు. ఇన్నాళ్లూ ప్రభుత్వ భాగస్వామ్యంలో ఉన్నా కాబట్టి ప్రశ్నించలేకపోయా. సీఎం వ్యవహార శైలితో వైసీపీ ఎమ్మెల్యేలు చాలా అసంతృప్తితో ఉన్నారు. పార్టీలో అనేక అవమానాలు భరించాను. ఇక ఉండలేక బయటికి రావాల్సి వచ్చింది. చిరంజీవి కుటుంబంతో నాకు చాలా సన్నిహిత సంబంధాలున్నాయి. ఆ దిశగానే జనసేన పార్టీలో గురువారం చేరబోతున్నా' అని ఆరణి చెప్పారు. చిత్తూరులో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్ మోహన్ గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు తనను ప్రజలు గెలిపించారని ఎమ్మెల్యేగా కొనసాగుతానని చెప్పారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అసెంబ్లీ సీటు జనసేనకే!

- చంద్రబాబు, పవన్ భేటీలో నిర్ణయం
- ఆరణి శ్రీనివాసులు, గంటా నరహరి తదితరుల పేర్లతో సర్వే
- నరసింహ యాదవ్, సుగుణమ్మలకు టీడీపీ అధిష్ఠానం నుంచీ పిలుపు

తిరుపతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గత రెండు నెలలుగా మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన పార్టీల శ్రేణుల్ని తికమకపెడుతూ వచ్చిన తిరుపతి అసెంబ్లీ సీటు కేటాయింపు విషయంలో స్పష్టత వచ్చింది. ఈ స్థానాన్ని మిత్రపక్షమైన జనసేనకు కేటాయించింది తెలుగుదేశం పార్టీ. ఇరు పార్టీల అధినేతలూ బుధవారం జరిపిన భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నిజానికి టీడీపీ, జనసేన పార్టీలు పొత్తు కుదుర్చుకున్నప్పటి నుంచీ తిరుపతి అసెంబ్లీ సీటు జనసేన పార్టీకే కేటాయిస్తారన్న అంచనాలు మొదలయ్యాయి.అయితే అర్థబలం, అంగబలం, అధికార బలాలతో పాతుకుపోయిన ప్రత్యర్థి పార్టీ నేతలను ఎదుర్కొనేందుకు అవసరమైన వనరుల్లో జనసేన నాయకులు వెనుకబడ్డారు. ఆ కారణంగా ఓ దశలో జనసేన తరపున ఉమ్మడి అభ్యర్థి బరిలో వుండరన్న ప్రచారం ప్రారంభమైంది. అయితే చివరికి బుధవారం ఇరు పార్టీల అధినేతలూ జరిపిన సమావేశంలో తిరుపతి సీటును పొత్తులో భాగంగా జనసేనకు ఖరారు చేశారు. అధికార పార్టీ అభ్యర్థిని దీటుగా ఎదుర్కొనేందుకు తగిన వనరులున్న అభ్యర్థిని ఎంపిక చేసే దిశగా జనసేన, టీడీపీ అధినేతలు అన్వేషణ మొదలుపెట్టినట్టు సమాచారం. అందులో భాగంగా దివంగత డీకే ఆదికేశవులుతో బంధుత్వం, పుష్కలంగా అర్థ బలం కలిగిన గంటా నరహరి పేరు ప్రధానంగా పరిశీలనలోకి వచ్చినట్టు తెలిసింది. అదే సమయంలో ఇటీవలే జనసేనాని పవన్ కళ్యాణ్‌ను కలసిన చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేరు కూడా పరిగణనలోకి తీసుకున్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. వీరిద్దరితో పాటు తిరుపతి జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్ తదితరుల పేర్లు కూడా కలుపుకుని గురువారం నుంచీ ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించనున్నట్టు సమాచారం.

స్థానికులకే టికెట్ ఇవ్వాలని బలిజల డిమాండ్

తిరుపతి సీటు జనసేనకు ఖరారైన నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ టికెట్ స్థానికులకే ఇవ్వాలన్న డిమాండ్ మొదలైంది. నియోజకవర్గంలో ప్రాబల్యం కలిగిన బలిజ సామాజికవర్గంలో పలువురు తిరుపతి టికెట్ స్థానికేతరులకు ఇవ్వరాదని కోరుతున్నారు. గురువారం లేదా శుక్రవారం ఆ సామాజికవర్గానికి చెందిన ముఖ్యులతో సమావేశం నిర్వహించి స్థానికులకే టికెట్ ఇచ్చేలా తీర్మానం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ పరిణామాలు ఎక్కడికి దారి తీస్తాయో వేచి చూడాల్సివుంది.ఈ నేపథ్యంలో తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మలకు అధిష్ఠానం నుంచీ పిలుపు వచ్చింది. గురువారం ఉదయం 11 గంటలకు మంగళగిరిలోని పార్టీ కార్యాలయం చేరుకోవాలని బుధవారం సాయంత్రం వారిద్దరికీ పిలుపు వచ్చింది. దీంతో నరసింహయాదవ్ బుధవారం రాత్రే బయల్దేరి వెళ్ళగా సుగుణమ్మ గురువారం ఉదయం వెళుతున్నట్టు సమాచారం. అక్కడ వారు తొలుత టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడితో సమావేశం కానున్నారు. తిరుపతి టికెట్ జనసేనకు కేటాయించిన నేపథ్యంలో వారికి అధిష్ఠానం నిర్ణయం గురించి వివరించేందుకు, జనసేన అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరేందుకు పిలిపించినట్టు తెలుస్తోంది. వీరిద్దరూ టికెట్ రేసులో నిలిచిన ప్రధాన ఆశావహులు కావడాన అధిష్ఠానం నిర్ణయం పట్ల వీరి అభిప్రాయం ఎలా వుంటుందో కూడా చూడాల్సి వుంది. అదే సమయంలో ఊకా విజయ్‌కుమార్ పేరు కూడా టీడీపీ టికెట్ రేసులో ప్రముఖంగా వినిపించిన సంగతి తెలిసిందే. ఆయన ఎలా స్పందిస్తారో తెలియడం లేదు. ప్రజారాజ్యం పార్టీలో గతంలో క్రియాశీలకంగా వ్యవహరించిన ఆయనకు చిరంజీవి, పవన్ కళ్యాణ్‌లతో సన్నిహిత సంబంధాలున్న నేపథ్యంలో ఆయన పేరు కూడా జనసేన అధినేత పరిగణనలోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

వైసీపీ విధ్వంస పాలనను అంతమొందించాలి

చిల్లకూరు, మార్చి 6: రాష్ట్రంలో విధ్వంసపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో అంతమొందించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో విద్యుత్, బస్సు చార్జీలు పెంచడంతో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైసీపీ అరాచకపాలనతో ప్రజలు విసిగిపోతున్నారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించుకునేందుకు చంద్రబాబుని సీఎంగా గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి, గుండాల లీలావతి, నెల్లటూరు చిరంజీవి, అన్నం మునిశేఖర్‌గౌడ్, సుప్రజ, నల్లం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



సమావేశంలో సీఐటీయూ నాయకులు

గూడూరు అర్బన్, మార్చి 6: రాష్ట్రంలో ఉన్న అన్ని మున్సిపాలిటీలలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వరరావు కోరారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు 16 రోజుల పాటు పోరాటాలు చేసి పలు సమస్యలను పరిష్కరించుకున్నామన్నారు. ఇది కార్మికుల పోరాట విజయం అన్నారు. కార్మికులంతా ఐకమత్యంతో ఉంటే ఎంతటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో బాలసుబ్రమణ్యం, జోగి శివకుమార్, రాజగోపాల్, గోపినాథ్, బీవీరమణయ్య, సురేష్, రమేష్, కోటేశ్వరరావు, ప్రభావతి, సంపూర్ణమ్మ పాల్గొన్నారు.

వాయు శివలింగ దర్శనం ఏర్పాటు


సమావేశంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ సభ్యులు

గూడూరు అర్బన్, మార్చి 6: శివరాత్రి పర్వదినం సందర్భంగా స్థానిక రెండోపట్టణ పరిధిలోని నరసింగరావుపేటలో గల ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయలో ఈ ఏడాది వాయు శివలింగ దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు విశ్వవిద్యాలయ సభ్యులు తెలియజేశారు. బుధవారం స్థానిక విశ్వవిద్యాలయంలో సభ్యులు మాట్లాడుతూ ప్రతిఏడాదీ శివరాత్రి సందర్భంగా శివలింగాలను భక్తుల సందర్శనార్థం ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది వాయుశివలింగ దర్శనం ఏర్పాటు చేస్తున్నామని భక్తులు పాల్గొని దర్శించుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారం కోసమే విద్యుత్ అదాలత్



విద్యుత్‌అదాలత్‌లో అధికారులు

గూడూరు, మార్చి 6: విద్యుత్‌వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించినట్లు విద్యుత్ శాఖ ఈఈ నరేంద్రరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక గోగినేనిపురంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యుత్ మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌లైన్ల ఏర్పాటులో జాప్యం, అధిక బిల్లులు వంటి సమస్యలను వినియోగదారులు తెలియజేశారన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరుసర్కిల్ ఎస్‌ఈ విజయన్, శ్రీనివాస ఆంజనేయమూర్తి, రామ్మోహన్‌రావు, అంజనీకుమార్, ఈశ్వరమ్మ, ప్రసాద్, రవికుమార్, వరప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సహకారం అందిస్తాం



మహిళల చేత వికలాంగుడికి నగదును అందజేస్తున్న దాత గోపీకృష్ణ

కోట, మార్చి 6 : ఎలాంటి ఆదరణకు నోచుకోని నిరుపేదలను అన్ని విధాలా ఆదుకుంటామని వ్యాపారవేత్త మర్లపల్లి గోపీకృష్ణ అన్నారు. కోటలోని రవినగర్‌లో తన సహకారంతో బుధవారం బీసీల ఐక్యవేదిక కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యాలయాన్ని ఉప్పల కోటేశ్వరరావు అనే వికలాంగుడి చేత ప్రారంభింపచేశారు. అదే వికలాంగుడికి రూ.20వేల నగదును సాయంగా అందజేశారు. పార్టీలకు అతీతంగా ఇక్కడ బీసీ ఐక్యవేదిక కార్యాల యాన్ని ప్రారంభించి పలు సమస్యల పరిష్కారానికి వేదికగా మార్చను న్నామని గోపీకృష్ణ తెలిపారు. పార్టీలకు, కుల మతాలకు అతీతంగా తమ సేవా కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన పదో తరగతి ప్రశ్న పత్రాలు



కోట, మార్చి 6: పదో తరగతి పరీక్షల సెట్-1 ప్రశ్నాపత్రాలు బుధవారం కోట పోలీస్ స్టేషన్‌కు చేరాయి. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో కోటలోని జిల్లా పరిషత్ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలతోపాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బీసీ గురుకులాలతోపాటు విద్యానగర్‌లోని బాలభారతి ఉన్నత పాఠశాల, చిట్టేడులోని యానాదుల గురుకుల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీంతో వాకాడు, కోట ఎంఈవోలు నసీమ్‌ఆలీ, మస్తానయ్యల పర్యవేక్షణలో ప్రశ్న పత్రాలను కోట పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు.

టీడీపీకి బీసీలే పట్టుకొమ్మలు

కోట, మార్చి 6 : టీడీపీకి బీసీలే పట్టుకొమ్మలని ఆ పార్టీ వరాలు ఇవ్వడం హర్షణీయమని టీడీపీ బీసీ సంఘం నాయకులు పేర్కొన్నారు. కోటలో బుధవారం ఆయా టీడీపీ బీసీ సెల్ విభాగం నాయకులు మట్లాడుతూ స్వాతంత్ర్యం తర్వాత భారత దేశంలో బీసీ కులాలకు ఇప్పటి వరకు రాజ్యాధిఫలాలు దక్కలేదన్నారు. ప్రస్తుతం 175 అసెంబ్లీ స్థానాల్లో నామినేటెడ్ పోస్టులు కలిపి 50శాతం బీసీ కులాలకు ఇస్తామని చంద్రబాబు హామీ ఇవ్వడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో బీసీ దాని ఉపకులాలు, రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సెల్ పార్లమెంట్ కార్యదర్శి తీగల సురేష్‌బాబు, నియోజకవర్గ అధ్యక్షుడు కందల బాలకృష్ణ యాదవ్, తల్లం శ్రీనివాసులు, వంశీ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

జాతీయ రహదారికి సబ్‌వేలు నిర్మించాలి


వెంకయ్యనాయుడును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నాయుడుపేట, మార్చి 6 : నాయుడుపేట -రేణిగుంట జాతీయ రహదారి ఆరు లేన్ల నిర్మాణంలో భాగంగా నాయుడుపేట ప్రాంతం వద్ద సబ్‌వేలు ఏర్పాటు చేయాలని బీజేపీ ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర కార్యదర్శి విజయభాస్కర్ కోరారు. ఆ మేరకు బుధవారం మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును వెంకటాచలంలో కలసి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, హంస పృథ్వీ, యనమల అశోక్ తదితరులు ఉన్నారు.

హత్యకేసులో జీవితఖైదు

గూడూరు, మార్చి 6: నాయుడుపేట మండలం అన్నమేడు గ్రామంలో జరిగిన ఓ హత్యకేసులో నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ. 5వేలు జరిమానా విధిస్తూ బుధవారం ఏడవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కోర్టు సిబ్బంది కథనం మేరకు.. అన్నమేడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు అతని బావమరిది వీరాస్వామికి మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2022 డిసెంబరు 16వ తేదీ గ్రామంలోని ఓ దుకాణం వద్ద ఉన్న వెంకటేశ్వర్లును వీరాస్వామి డబ్బులు ఇవ్వాలని అడిగాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో వీరాస్వామి సూరికత్తితో వెంకటేశ్వర్లును పొడవడంతో అతడు మృతి చెందాడు. అప్పట్లో నాయుడుపేట పోలీసులు కేసునమోదు చేసుకుని నిందితుడు వీరాస్వామిని అరెస్ట్‌చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసులో వాదోపవాదనలు విన్న న్యాయస్థానం నిందితుడికి శిక్ష ఖరారు చేసింది. బాధితుల తరుపున ఈ కేసును ఏపీపీ సుహాసిని వాదించారు.

కాలువలోకి దూసుకెళ్లిన 104



సూళ్లూరుపేట, మార్చి 6: మండల పరిధిలోని మంగళంపాడు సమీపంలోని దొండ కాలువ వద్ద బుధవారం 104 వాహనం సైడ్ కాలువలోకి దూసుకెళ్లింది. సూళ్లూరుపేట నుంచి మంగానెల్లూరులో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి 104 వాహనంలో సిబ్బంది బయలుదేరారు. దొండకాలువ వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించే క్రమంలో పక్కనే ఉన్న సైడ్ కాలువలోకి దూసుకెళ్లింది. సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. మంగళంపాడు గ్రామస్థులు సంఘటన స్థలానికి చేరుకొని 104 వాహనాన్ని ఎక్స్‌కవేటర్‌తో బయటకు తీశారు.

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

నాయుడుపేట, మార్చి 6 : నాయుడుపేట స్వర్ణముఖి నది తీరాన వెలసిన ప్రసూనాంబసమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో గురువారం నుంచి శివరాత్రి మహోత్స వాలు ప్రారంభిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి తెలిపారు. 7వ తేదీ గురువారం అంకురార్పణ, ధ్వజారోహణం, 8వ తేదీ శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గణపతిహోమం, పాలాభి షేకాలు నందివాహనసేవ, ఏకాదశ రుద్రాభిషేకాలు, 9న రుద్రహోమం, లలితహోమం, భజన కార్యక్ర మాలు, 10న ప్రసూనాంబసమేత నీలకంఠేశ్వరస్వామి కల్యాణం, 11న వసంతోత్సవం, త్రిశూలస్నానం, 12న ధ్వజాఅవరోహణం కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

పట్టపగలే రెచ్చిపోయిన చైన్ స్నాచర్లు

- మహిళ మెడలో గొలుసు చోరీ

పెళ్లకూరు, మార్చి 6 : మండలంలోని శిరసనంబేడులోని ఓ ప్రైవేట్ పరిశ్రమ ఎదురుగా దుకాణం నిర్వహిస్తున్న మహిళ మెడలో నుంచి నలుగురు దుండగులు బంగారు గొలుసును లాక్కెళ్లడంతో ఆమెకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. అట్ల పద్మమ్మ దుకాణంలో ఉండగా నలుగురు దుండగులు బైక్‌పై వచ్చి అదును చూసి ఆమె మెడలో నుంచి చైన్‌ను లాక్కొని బైక్‌ను వదిలి పారిపోయారు. గాయపడిన పద్మమ్మను స్థానికులు 108లో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్సలు అనంతరం మెరుగైన వైద్యం కోసం గూడూరుకు తరలించారు.

అనారోగ్యంతో ఒడిశా కార్మికుడి మృతి

నాయుడుపేట టౌన్, మార్చి 6 : మేనకూరు సెజ్‌లో ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికుడు సమీర్ (45) అనారోగ్యంతో మృతిచెందాడు. సమీర్ కొంతకాలంగా మేనకూరు ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. రెండు రోజులుగా ఆరోగ్యం సరిగా లేదంటూ గదిలోనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. మంగళవారం బహిర్భూమికి వెళ్తుండగా అకస్మాత్తుగా పడి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

నాయుడుపేట టౌన్, మార్చి 6 : మండలంలోని అన్నమేడు గ్రామ సమీపంలో మోటార్ సైకిల్ ఆటోను ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. మేముగుంట పాలెంకు చెందిన శ్రీనివాసులు నాయుడుపేటకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా అన్నమేడు సమీపంలో ఎదురుగా ఆటో ఢీకొంది. శ్రీనివాసులకు గాయాలయ్యాయి. 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్సలు అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



కోట, మార్చి 6 : కోటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని 104 మంది 10వ తరగతి విద్యార్థినిలకు బుధవారం ఎస్‌ఐ నాగబాబు చేతుల మీదుగా విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. కోట పట్టణానికి చెందిన డాక్టర్ అన్వేష్‌రెడ్డి, మీజూరు చంద్రప్రకాష్‌ల దాతృత్వంతో వీటిని అందించారు. అనంతరం దాతలను హెచ్‌ఎం విజయభాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.

యువతను మోసం చేసిన వైసీపీ


పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 6: అధికారంలోకి వస్తే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా వైసీపీ ప్రభుత్వం యువతను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ విమర్శించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన యువత టీడీపీలో చేరడంతో స్థానిక రైతుబజారు నుంచి టీడీపీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. యువత మాజీ ఎమ్మెల్యేను చీనికాయలతో చేసిన గజమాలతో సన్మానించారు. అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి పసుపు కండువాలను కప్పి మాజీ ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అసమర్థ, అరాచక పాలనతో రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. గాడితప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలంటే చంద్రబాబుకే సాధ్యమవుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో యువతకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. వలంటీర్లు వ్యవస్థను తొలగించేది లేదని టీడీపీ అధికారంలోకి వస్తే వారికి వేతనాలు పెంచుతామన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, కరీముల్లా, రవీంద్రరెడ్డి, మస్తాన్‌నాయుడు, వెంకటేశ్వర్లు, శ్రీధర్, ప్రణీత్, చరణ్, సిద్ధయ్యనాయుడు, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు పాలాభిషేకం

స్థానిక పార్టీ కార్యాలయంలో బీసీ నాయకుల ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే 50 సంవత్సరాలు నిండిన బీసీలకు రూ.4వేలు పెన్షన్ అందజేస్తామని, రిజర్వేషన్‌లను పెంచుతామని చంద్రబాబు ప్రకటించడంతో ఇలా అభిమానం చాటుకున్నారు.

విజయానికి కేరాఫ్.. నెలవల కుటుంబం

- వైసీపీ దౌర్జన్యాలను దీటుగా ఎదుర్కొంటాం
- నా కుమార్తెను ఆశీర్వదించండి
- నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల


సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, మార్చి 6 : విజయానికి కేరాఫ్ నెలవల కుటుంబం అని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్ర హ్మణ్యం అన్నారు. నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న శ్రీనివాస ఫంక్షన్ హాలులో బుధవారం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి విజయశ్రీ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ తాను గానీ, తన సతీమణి అమృతసరళ గానీ ఇప్పటివరకు పోటీచేసి విజయమే సాధించా మేగానీ ఓటమి అనేది లేదన్నారు. తమ కుమార్తె విజయశ్రీని సైతం ఆశీర్వదించి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైసీపీ దౌర్జన్యాలను దీటుగా ఎదుర్కొంటామని తమ కార్యకర్తల జోలికివస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. టీడీపీ సీనియర్ నేత వేనాటి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ సమయం ఆసన్నమైందని ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న రాక్షసపాలనకు ప్రజలు ఓటు అనే ఆయుధంతో గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, కందల కృష్ణారెడ్డి, ఆదవరం నాగూరయ్య, గూడూరు ప్రభావతమ్మ, సుధీర్‌రెడ్డి, కట్టా రమణారెడ్డి, పసల గంగాప్రసాద్, 786 రఫీ, నెలవల రాజేష్, సుబ్బారావు, రవి, నారాయణ తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న సీడీపీవో మునికుమారి

కోట, మార్చి 6 : బాల్య వివాహాల నిర్మూలనపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వ హించాలని సీడీపీవో మునికుమారి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీ వర్కర్లతో బాల్య వివా హాల నిర్మూలనపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. వీటిపై నిఘా వేయాల న్నారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా నేరమే అన్నారు. ఈ నిబంధనలపై ఆయా మండలాల్లో ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో విస్తృతప్రచారం చేయాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో సూపర్ వైజర్లు కవిత, శేషమ్మ, కృష్ణమ్మ, పద్మమ్మ, తదితరులు ఉన్నారు.

టీడీపీలోకి జోరందుకున్న వలసలు


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, మార్చి 6 : రాష్ట్రంలో సీఎం జగన్ అరాచక పాలనతో విసిగి వైసారిన వైసీపీ శ్రేణులు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నాయని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మ ణ్యం పేర్కొన్నారు. చెంబేడు గ్రామానికి చెందిన ఐదు వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో మాజీ ఎంపీ నెలవల, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి సమక్షంలో బుధవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ రోజు రోజుకి టీడీపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో ప్రజలు టీడీపీలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. కొత్తగా వచ్చే వారిని గౌరవిస్తూ అందరూ కలసి మెలసి పార్టీకోసం పని చేయాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. టీడీపీ -జనసేన అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీని ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని పార్టీలో చేరిన వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, మరుపూరు మస్తాన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, వేలూరు రమణయ్య, పెళ్లకూరు గోపాల్‌కృష్ణ, తాళ్ల యుగంధర్, రాపూరు పరుశురామ్ పాల్గొన్నారు.

రోడ్డు సమస్య పరిష్కరిస్తాం..ఓటింగ్‌లో పాల్గొనండి


గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్

సూళ్లూరుపేట, మార్చి 7: రోడ్డేస్తేనే.. ఓటు వేస్తా లేదంటే ఎన్నికలు బహిష్కరి స్తామంటూ తీర ప్రాంత గ్రామాలకు చెందిన యువకులు రెండు నెలల నుంచి పోరాటాలు చేస్తున్నారు. కడపత్ర, దామరాయి, కొరిడి, వేనాడు పంచాయ తీలకు చెందిన ప్రజల మద్దతు కూడగడుతు న్నారు. దీంతో జిల్లా అధికారులు ఈ సమస్యపై దృష్టిసారించారు. బుధవారం తహసీల్దార్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఆర్ అండ్ బీ డీఈ పరమేశ్వరి, ఫారెస్ట్ సెక్షన్ అధికారి ప్రకాష్ కడపత్ర గ్రామాలకు వెళ్లి అక్కడ ప్రజలతో సమావేశమై రోడ్డు సమస్యపై చర్చించారు. ఓటుకు, రోడ్డు సమస్యకు సంబంధం లేదని తెలియజేశారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకొంటామన్నారు. ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. అధికారులకు సహకరించి సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు.

జనరిక్ మందుల దుకాణం ప్రారంభం

గూడూరు, మార్చి 6 : ప్రజలకు ప్రయోజనం లభించేలా తక్కువ ధరకే జనరిక్ మందులను అందుబాటులోకి తీసుకువచ్చామని డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి రవి రాజశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక 24 సొసైటీ కార్యాలయ ఆవరణలో ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాన్ని ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రతి పేదవాడికీ ఎలాంటి ఆర్థికభారం పడకుండా తక్కువ ధరకే మెరుగైన మందులను అందించేలా కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు రెడ్డి, నారాయణ, గురవయ్య, క్రిష్ణయ్య, రవేంద్రరాజు బాబు రెడ్డి, జనార్ధనరెడ్డి, వసంతరెడ్డి, రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

నాయుడుపేట టౌన్, మార్చి 6: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న తనతో ముగ్గురు వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తించారని సంచార జాతులకు చెందిన ఓ మహిళ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. ఆమె తెలియజేసిన వివరాల మేరకు నాగార్జునరెడ్డి, శీను, ఆనంద్‌లపై సీఐ శ్రీనివాసులురెడ్డి కేసు నమోదు చేశారు.

సాఫ్ట్‌వేర్ రంగంలో మెరుగైన ఉపాధి



మాట్లాడుతున్న విభాగాధిపతి, సభ్యులు

కోట, మార్చి 6: సాఫ్ట్‌వేర్ రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని థింక్‌చాంప్ సంస్థ సీఈవో గురులోకేష్ తెలియజేశారు. మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం తిరుపతికి చెందిన థింక్‌చాంప్ సంస్థ ఆధ్వర్యంలో వర్క్‌షాపు జరిగింది. ఇంజ నీరింగ్ 3వ సంవత్సరం చదువుతున్న 110 మంది విద్యార్థులకు రెండురోజులపాటు నైపుణ్య శిక్షణ తరగతులు కూడా ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రాముఖ్యత కలిగినటువంటి పైథాన్ ఫుల్‌స్టాక్, హెచ్‌పీఎంఎల్ అంశాలపై సీఈవో గురులోకేష్ అవగాహన కల్పించారు. ఈ శిక్షణా తరగతులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

తడ, మార్చి 6 : బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. తమిళనాడు అరంబాకానికి చెందిన మణికందన్ (36) శ్రీసిటీ సెజ్‌లోని ఓ పరిశ్రమలో పనిచేస్తుంటాడు. ఆదివారం రాత్రి స్నేహితుడిని కలుసుకునేందుకు బైక్‌పై కారూరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలో మత్స్యకార సముదాయ భవనం వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో అతను కిందపడిపోయి గాయపడ్డాడు. అతడిని స్థానికులు చెన్నైకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ధ్వజారోహణం


పుట్టమట్టిని తెస్తున్న ఆలయ పాలకవర్గం

సూళ్లూరుపేట, మార్చి 7: సూళ్లూరుపేటలోని నాగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 11 వరకు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం చెంగాళమ్మ ఆలయం నుంచి పుట్టమట్టి తెచ్చి వేద పండితులు, మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు చేసి ధ్వజారోహణం చేశారు. అనంతరం ఆలయంలో అఖండ జ్యోతిని వెలిగించి ఉత్సవాలను ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రమణ్యం రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చెంగాళమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రా రెడ్డి, వాకాటి బాబురెడ్డి, దయాకర్ రెడ్డి, సూర్యనారాయణ, కొండూరు వెంకటేశ్వర్లు, భువనేశ్వరి, వంకా చంద్రశేఖర్, ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిలివేటి మస్తానమ్మకు ప్రముఖుల నివాళి



తడ, మార్చి 6 : మండల పరిధిలోని కాదలూరు సర్పంచ్ కిలివేటి మస్తానమ్మకు పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. కిలివేటి మస్తానమ్మ స్థానిక శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య తల్లి. ఆమె గత నెల 21వ తేదీ మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో బుధవారం పలువురు ప్రముఖులు ఆమె చిత్రపటానికి నివాళుల ర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు మేరుగ మురళి, బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, చెంగాళమ్మ ట్రస్టు బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఎంపీపీలు కొలవి రఘురెడ్డి, అల్లూరు అనిల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'నా బిడ్డను ఆదరించండి'


శ్రీపురంలో మహిళలను పలకరిస్తున్న నేదురుమల్లి రాజ్యలక్ష్మి

డక్కిలి, మార్చి 6 : వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న తన బిడ్డ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ఆదరించాలని ఆయన తల్లి, మాజీ మంత్రి రాజ్యలక్ష్మి కోరారు. బుధవారం ఆమె శ్రీపురం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తన కుమారుడికి ఓ అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామానికి చెందిన సన్నుబోయిన రమణయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రయంలో వెంకటగిరి ఎంపీపీ తనూజారెడ్డి, శివారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులు రెడ్డి, సన్నుబోయిన ఈశ్వరయ్య యాదవ్, మాధమాల నారాయణరెడ్డి ఉన్నారు.